# విశాల భారతి

06-12-2025

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్ సంపుటి:3 సంచిక: 336




## మన స్నేహం ఎప్పటికీ శాశ్వతం

- భారత్, రష్యా ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపోతం
- 23వ ఇండియా-రష్యా సమ్మిట్‌లో పీఎం మోదీ, పుతిన్
- 2030 వరకు ఆర్థిక సహకార ప్రణాళికపై ఒప్పందం
- ఇంధన భద్రత, ఉగ్రవాద నిర్మూలన, టూరిజం అంశాలపై చర్చలు
- రష్యా నుంచి స్థిరమైన ఆయిల్, గ్యాస్, కోల్ సరఫరా
- బిగ్ సెవెన్ కూటమిపై పుతిన్ విమర్శలు గుప్పించారు

03

## రాసి పెట్టుకోండి.. వచ్చేది మన ప్రభుత్వమే

- ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామాల సర్పంచ్‌లు ఏకగ్రీవం
- కేసీఆర్‌ను కలిసిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు
- ఈ సందర్భంగా మాజీ సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు
- మనకు అన్ని కాలాలు అనుకూలంగా వుండయి
- గొప్ప ఆలోచనలతో గ్రామాలను అభివృద్ధి చేయాలి
- కాంగ్రెస్ పాలనలో పల్లెల్లో దిగజారిన పరిస్థితిలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మనకు అన్ని కాలాలు అనుకూలంగా వుండయి. కొన్నికొన్ని సమయాలు కష్టాలు వస్తయి.. వాటికి వెరవకూడదు. మల్లా మన ప్రభుత్వమే వస్తది. తెలంగాణ పల్లెలకు తిరిగి మంచిరోజులు వస్తయి.. అప్పుడిదాకా ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో అధైర్య పడొద్దు..బీఆర్ ఎస్ ప్రభుత్వం అందించిన స్పూర్తితో స్వయంశక్తితో పల్లెలను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు నడవాలె " అని మాజీ కేసీఆర్ అన్నారు. ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామాల నూతన సర్పంచులు.. వార్డు మెంబర్లు శుక్రవారం కేసీఆర్ ని మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ " ఇప్పుడు నూతనంగా ఎన్నికైతున్న సర్పంచులు గొప్ప

మిగతా 3లో..



# ఢిల్లీని ఢీకొడతా..!

## నర్సంపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు

### రూ.508 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం

- ప్రధాని మోదీ, కేసీఆర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు
- అభివృద్ధి కోసం ఢిల్లీనైనా ఢీ కొడుతా అన్నారు
- తెలంగాణకు కేంద్రం అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు
- జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌ను బండకేసి కొట్టారు
- అభివృద్ధి జరగాలంటే మంచి సర్పంచ్‌ను ఎన్నుకోండి
- మార్చి 31వ తేదీలోపు వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ పనులు ప్రారంభిస్తాం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు మోదీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎందుకు సహకరించడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణ ప్రజలు ఆశీర్వదిస్తే ఢిల్లీని ఢీకొడతానని హెచ్చరించారు. తనకు వయస్సు ఉందని, ఓపిక ఉందని కేంద్రాన్ని నిలదీస్తానని వార్నింగ్ ఇచ్చారు. శుక్రవారం నర్సంపేటలో సీఎం పర్యటించారు. రూ.508 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించారు సీఎం రేవంత్‌రెడ్డి.

'జూబ్లీహిల్స్ ఎన్నిక రెఫరెండం అన్నోళ్లు ఇంట్లో పండుకోక మళ్లీ అబద్ధాలు చెబుతూ తిరుగుతున్నారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌ను బండకేసి కొట్టారు. అభివృద్ధి జరగాలంటే మంచి సర్పంచ్‌ను ఎన్నుకోండి. స్థానిక సంస్థల ఎన్నికల్లో క్వార్టర్‌కో, హాఫ్‌కో, పుల్లుకో ఓటు వేయొద్దు. ఎన్నికల్లో పైసలు ఖర్చు చేయొద్దు, ప్రజల మనసుతో గెలవాలి. గ్రామాల్లో ఉండే యువకులు సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయండి. గ్రామాల్లో సర్పంచులు మంచోళ్లను గెలిపిస్తే అభివృద్ధి సాధ్యమవుతుంది.

మిగతా 3లో..

## తెలంగాణ అభివృద్ధిలో గ్లోబల్ సమిట్ కీలకం

- గ్లోబల్ సమ్మిట్‌పై కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ స్పందన
- రాష్ట్ర అభివృద్ధిలో ఈ సమ్మిట్ కీలక పాత్ర పోషిస్తుంది
- సమ్మిట్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూన్నాని వెల్లడి
- మూడంచెల వ్యూహంతో తెలంగాణ ముందుకు సాగుతోంది
- అంతర్జాతీయ ప్రతిభ అభివృద్ధికి ఈ సదస్సు తోడ్పడుతుంది
- సీఎం రేవంత్ రెడ్డికి సోనియా అభినందనలు తెలియజేశారు



06



## బీజేపీ.. బీఆర్ఎస్‌ది ఒకే డ్రామా

- హిల్ట్ పాలసీపై బీఆర్ఎస్ విమర్శలను పొంగులేటి తిప్పికొట్టారు
- సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు
- పాలసీలో రెండు అంశాలు బీఆర్ఎస్ పాలనలో వచ్చాయని స్పష్టం
- ఫైల్‌పై మంత్రిగా కేటీఆర్ సంతకం చేసిన సంగతి మరిచారు
- ముడుపులు తీసుకొని భూములను కన్వర్షన్ చేశారు
- 2026 మార్చి నాటికి 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తవుతుందని వెల్లడి

03

## ఇది దిక్కుమాలిన పాలన

- రేవంత్ సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు
- ప్రభుత్వం పోలీసుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు
- పోలీసులపై తీవ్ర వివక్ష చూపిస్తోందని విమర్శించారు
- నిమ్స్ ఆస్పత్రికే పరిమితం చేయడం శోచనీయమన్నారు
- హక్కులను కాలరాయడం ద్వంద్వ వైఖరికి నిదర్శమన్నారు
- ఎన్నికలకు ముందు ఏక్ పోలీస్ వ్యవస్థ తెస్తామని ఊదరగొట్టారు



02

## కోటి ఎకరాల భూములపై లావాదేవీలు బంద్!

- తెలంగాణ రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది
- కోటి ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చింది
- నిషేధిత భూముల జాబితా రూపకల్పనలో అనేక అవకతవకలు
- రాష్ట్రంలో ఒక కోటి ఎకరాలకు పైగా నిషేధిత భూముల జాబితాలో
- ప్రభుత్వాలు మారినా ప్రజలకు ఉపయోగం లేదనే విమర్శ




02



## సీఎం ఆదేశిస్తే రాజీనామాకు రెడీ

- అనర్హత పిటీషన్ పై విచారణ కోసం స్పీకర్ తాజాగా నోటీసు జారీ
- రాజీనామాపై ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు
- ఎన్నికల్లో పోటీ చేయడం, పోరాడటం తనకు కొత్త కాదు
- ఎమ్మెల్యేల అనర్హత కేసు సుప్రీంకోర్టులో కొనసాగుతోందని వెల్లడి
- మరో పదేళ్లు రేవంత్ సీఎంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్న దానం
- రేవంత్ నాయకత్వం రాష్ట్రానికి అవసరం ఉందని అన్నారు

02

## జగన్ అసెంబ్లీకి వెళ్లాలి

- ఏపీ సీఎం చంద్రబాబును మంత్రి కోమటిరెడ్డి కలిశారు
- తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు ఆహ్వానించారు
- పవన్ కళ్యాణ్ పై చేసిన విమర్శలపై స్పందించారు
- పరిస్థితుల వల్ల పవన్‌పై వ్యాఖ్యలు చేశానని స్పష్టం
- ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు కలిసి మెలిసి ఉండాలి
- జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి వెళ్లాలని సలహా ఇచ్చారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి.. తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఓ సలహా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ సదస్సు కోసం పలువురు రాజకీయ ప్రముఖులను తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహా పలువురు రాష్ట్రాల ముఖ్యమంత్రులను గ్లోబల్ సమ్మిట్‌కు రావాల్సిందిగా తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. ఈ క్రమంలోనే ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానించారు.

మిగతా 2లో..

# జగన్ అసెంబ్లీకి వెళ్లాలి

**( మొదటిపేజీ తరువాయి )**



అమరావతిలోని సీఎం చంద్రబాబు నాయుడు క్యాంపు కార్యాలయంలో ఏపీ సీఎంతో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌కు రావాల్సిందిగా చంద్రబాబును కోమటిరెడ్డి ఆహ్వానించారు.దావోస్ సదస్సు తరహాలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నిర్వహిస్తున్నట్లు చంద్రబాబుకు వివరించారు. ఈ సదస్సుకు ప్రముఖ వ్యాపారవేత్తలు, ప్రముఖ సంస్థల ప్రతినిధులు, నిపుణులు హాజరవుతున్నట్టు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పలు అంశాలపై స్పందించారు. చంద్రబాబు నాయుడు విజన్ 2020 కి హైదరాబాద్ ప్రతిరూపమని కొనియాడారు. ఏపీ రాజధాని అమరావతి కూడా ఫ్యూచరిస్టిక్ కేపిటల్‌గా అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సలహా ఇచ్చారు. వైఎస్ జగన్‌కు వీలైతే అసెంబ్లీకి వెళ్లాలని సూచించారు. ప్రజాసమస్యలను లేవనెత్తడానికి శాసనసభకు మించిన వేదిక లేదని సూచించారు. ఏ రాష్ట్రంలో అయినా సీఎం తర్వాత.. విపక్ష నేతకు అత్యధిక ప్రాధాన్యం ఉంటుందన్న కోమటిరెడ్డి.. బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ పోరాటాన్ని గుర్తు చేశారు. అప్పట్లో తాము ఆరుగురు ఎమ్మెల్యేలమే అయినప్పటికీ.. అసెంబ్లీకి వెళ్లి బీఆర్ఎస్ మీద పోరాడామని గుర్తు చేశారు. వైఎస్ జగన్ కూడా అసెంబ్లీకి వెళ్లాలని సూచించారు. మరోవైపు పవన్ కళ్యాణ్ మీద ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కోమటిరెడ్డి స్పందించారు. పవన్ కళ్యాణ్ దిష్టి వ్యాఖ్యలను తప్పుబట్టిన కోమటిరెడ్డి.. పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పకపోతే సినిమాలను ఆడనివ్వబోమంటూ ఇటీవల వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అయితే ఆ తర్వాతి పరిణామాల నేపథ్యంలో జనసేన పార్టీ పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపట్ల వివరణ ఇచ్చింది. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరించవద్దని కోరింది. దీంతో ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పడగా.. తాజాగా పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై కోమటిరెడ్డి వివరణ ఇచ్చారు. అప్పటి పరిస్థితుల కారణంగా అలా మాట్లాడాల్సి వచ్చిందన్నారు. తెలుగు రాష్ట్రాలు కలిసి ఉండాలని.. ప్రజల మధ్య స్నేహం కొనసాగాలనేది తమ అభిలాష అని వెల్లడించారు.

చంద్రబాబుతో భేటీ తర్వాత బయటికి వచ్చిన కోమటిరెడ్డి జగన్ అసెంబ్లీకి వెళ్లకపోవడంపై స్పందించారు. జగన్ కి ప్రతిపక్ష హోదా ముఖ్యం కాదని ఆయన తేల్చేసారు. జగన్ అది వదిలి అసెంబ్లీకి వచ్చి కూర్చోవాలని సూచించారు. ప్రజా సమస్యలపై వచ్చి పోరాడాలన్నారు.హోదా ఉంటేనే అసెంబ్లీకి వెళ్తాము అని జగన్ అనడం కరెక్ట్ కాదన్నారు.తెలంగాణ లాగా ఏపీ అభివృద్ధి చెందాలి అని కోరుకుంటున్నట్లు తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు జగన్ కు, ఆయన తండ్రి వైఎస్సార్ కు కూడా సన్నిహితుడైన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన ఈ సూచన ప్రాధాన్యం సంతరించుకుంది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత విపక్ష నేత హోదా అడిగిన జగన్ ప్రభుత్వం దాన్ని నిరాకరించేసరికి అసెంబ్లీకి వెళ్లకుండా దూరంగా ఉండిపోతున్నారు. దానికి బదులు ప్రెస్ మీట్లు పెట్టి తన వాదన వినిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో కోమటిరెడ్డి చేసిన సూచనను జగన్ పాటిస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

# ఇది దిక్కుమాలిన పాలన

- **రేవంత్ సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు**
- **ప్రభుత్వం పోలీసుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు**
- **పోలీసులపై తీవ్ర వివక్ష చూపిస్తోందని విమర్శించారు**
- **నిమ్స్ ఆస్పత్రికే పరిమితం చేయడం శోచనీయమన్నారు**
- **హక్కులను కాలరాయడం ద్వంద్వ వైఖరికి నిదర్శమన్నారు**
- **ఎన్నికలకు ముందు ఏక్ పోలీస్ వ్యవస్థ తెస్తామని ఊదరగొట్టారు**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



ప్రైవేటు ఆస్పత్రులకు పెండింగ్ బకాయిలు విడుదల చేయకుండా ఆరోగ్య భద్రత ద్వారా పోలీసులకు అందించే వైద్య చికిత్సలను నిమ్స్ ఆసుపత్రికే పరిమితం చేయడం అత్యంత దుర్మార్గమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు మండిపడ్డారు. పోలీసుల జీతాల నుంచి ప్రతి నెలా ఆరోగ్య భద్రత కోసం డబ్బులు కట్ చేసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. వారికి సేవలు అందించడంలో మాత్రం తీవ్ర వివక్ష చూపిస్తోందని విమర్శించారు. నిత్యం ప్రజల భద్రత కోసం కృషి చేసే పోలీసులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యాన్ని దూరం చేసి, నిమ్స్ ఆస్పత్రికే పరిమితం చేయడం శోచనీయమని అన్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల, సకాలంలో వైద్యం అందక పోలీసు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీశ్‌రావు తెలిపారు. గతేడాది అక్టోబర్‌లో గుండెపోటుకు గురైన ఏఆర్ ఎస్సై జనార్ధన్‌రావును 'గోల్డెన్ అవర్'లో ఓ ప్రముఖ ప్రైవేటు దవాఖానకు తరలించినప్పటికీ.. పోలీసు ఆరోగ్య భద్రత కార్డు ద్వారా చికిత్సకు నిరాకరించడంతో సకాలంలో చికిత్స అందక ప్రాణాలు కోల్పోయాడని పేర్కొన్నారు. ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నా, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పాలకులకు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదని.. ఇది అత్యంత బాధాకరం, అమానవీయమని అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి పాలనలో పోలీసు ఆరోగ్య భద్రత గాలిలో దీపంగా మారిందని హరీశ్‌రావు అన్నారు. ప్రజల ప్రాణాలకు రక్షగా ఉండే పోలీసులకే రక్షణ కరువైన దిక్కుమాలిన పాలన ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిది అని విమర్శించారు. ఆపత్కాలంలో ఆదుకునే ఉద్దేశ్యంతో ప్రారంభించిన ఆరోగ్య భద్రత పథకం లక్ష్యాన్ని నీరుగార్చుతుండటం హేయమైన చర్య అని అన్నారు. ఆంక్షలు, అరెస్టులతో నిత్యం పోలీసుల పహారా నడుమ పాలన సాగిస్తున్న రేవంత్ రెడ్డి గారు.. ఇప్పుడు ఆ పోలీసుల జీవితాలతో చలగాటమాడటం దుర్మార్గమని మండిపడ్డారు. మీ రక్షణ కోసం వేల మంది పోలీసులను వాడుకుంటూ.. వారి కనీస హక్కులను కాలరాయడం మీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు.

ఎన్నికలకు ముందు ఏక్ పోలీస్ వ్యవస్థ తెస్తామని ఊదరగొట్టిన రేవంత్ రెడ్డి గారు.. అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలో తొక్కారని హరీశ్‌రావు విమర్శించారు. తమ సమస్యలు పరిష్కరించాలని, హక్కుల కోసం రోడ్డెక్కిన పోలీసులనే అరెస్టు చేయించి జైలు పాలు చేయడం, సస్పెండ్ చేయడం మీ అహంకారానికి నిదర్శనం.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అంటే అని ప్రశ్నించారు. ఒకపక్క వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారని.. మరోపక్క పోలీసులకు రావాల్సిన సరెండర్ లీవ్ డబ్బులు, టీఏలు, స్టేషన్ అలవెన్సులు రాక మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. పోలీసులంటే మీకెందుకంత కక్ష రేవంత్ రెడ్డి గారు అని నిలదీశారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఆరోగ్య భద్రత బకాయిలన్నీ చెల్లించి, నిమ్స్ తో పాటు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో పోలీసులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్, టీఏలు వెంటనే చెల్లించాలని, స్టేషన్ అలవెన్సులు నెల నెలా విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ రెడ్డి ఆడిన రాక్షస రాజకీయ క్రీడలో తమ్ముడు సాయి ఈశ్వర్ బలైపోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. బీసీ బిడ్డ ఆత్మబలిదానానికి కారణమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీసీ సమాజం ఎన్నటికీ క్షమించదని తెలిపారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్య అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అధికార దాహానికి బలైన ప్రాణం ఇది అని పేర్కొన్నారు. సాయి ఈశ్వర్ ఆత్మకు శాంతి కూరాలని ఆ దేవుడిని హరీశ్‌రావు ప్రార్థించారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని, రూ. 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని సాయి ఈశ్వర్ ఇటీవల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తీన్మార్ మల్లన్నను కలవడానికి వెళ్లిన సాయిఈశ్వర్ గురువారం సాయంత్రం.. ఆయన ఆఫీసు ముందు పెట్రోల్ పోసుకుని నిప్పటించుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు ఫైరింజన్, పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న వారు మంటలను ఆర్పివేసి సాయిఈశ్వర్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడే పరిస్థితి విషమించడంతో ఇవాళ సాయిఈశ్వర్ ప్రాణాలు కోల్పోయాడు.

# సీఎం ఆదేశిస్తే రాజీనామాకు రెడీ

- **అనర్హత పిటీషన్ పై విచారణ కోసం స్పీకర్ తాజాగా నోటీసు జారీ**
- **రాజీనామాపై ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు**
- **ఎన్నికల్లో పోటీ చేయడం, పోరాడటం తనకు కొత్త కాదు**
- **ఎమ్మెల్యేల అనర్హత కేసు సుప్రీంకోర్టులో కొనసాగుతోందని వెల్లడి**
- **మరో పదేళ్లు రేవంత్ సీఎంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్న దానం**
- **రేవంత్ నాయకత్వం రాష్ట్రానికి అవసరం ఉందని అన్నారు**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



రాజీనామాపై ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామాపై ఆయన స్పందించారు. రాజీనామాలు చేయడం, గెలవడం తన రక్తంలోనే ఉందని, ఎన్నికల్లో పోటీ చేయడం తనకు కొత్తేమీ కాదని చెప్పారు. అనర్హత వేటుపై ప్రస్తుతం విచారణ జరుగుతుందని వివరించారు. రేవంత్ నాయకత్వం రాష్ట్రానికి అవసరం ఉందని చెప్పిన దానం.. రాజీనామా అంశం పైన తన వైఖరి ఏంటో తేల్చేసారు. దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా పై కొంత కాలంగా చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యే దానం నాగేందర్ రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నారని పార్టీ నేతలే చెప్పుకొచ్చారు. ఇప్పటికే అనర్హత పిటీషన్ పై విచారణ కోసం స్పీకర్ తాజాగా మరోసారి దానం కు నోటీసు జారీ చేసారు. ఇదే సమయంలో ఢిల్లీలో పార్టీ ముఖ్య నాయకత్వంతో దానం చర్చలు చేస్తున్నారు. రాజీనామాకు సిద్ధమేనంటూ కొన్ని అంశాల ను ప్రస్తావించారు. ఉప ఎన్నిక తరువాత కీలక పదవి పైనా దానంకు హామీ లభించినట్లు సమాచారం. బీఆర్ఎస్ టికెట్ పై గెలిచిన దానం.. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో ఆయన పార్టీ మారినట్లుగా స్పష్టమైన ఆధారం ఉన్నట్లయింది.

దీంతో, తనపై విచారణ కొనసాగితే అనర్హత వేటు పడే అవకాశం ఉందని, అంతవరకూ వెళ్లకుండా తన పదవికి రాజీనామా చేయాలని దానం భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెప్పుకొచ్చాయి. ఇప్పుడు దానం తన రాజీనామా పైన స్పష్టత ఇచ్చారు. ఎమ్మెల్యే అనర్హత కేసు సుప్రీం కోర్టులో పెండింగ్ ఉందని చెప్పుకొచ్చారు. స్పీకర్ దగ్గర కూడా అనర్హత పిటిషన్ పెండింగ్ లో ఉందని వివరించారు. రానున్న రోజుల్లో సందర్భాన్ని బట్టి రాజీనామా పై నిర్ణయం ఉంటుందన్నారు. సీఎం రేవంత్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేసారు. ఎన్నికలు ఎదుర్కోవడం తనకు కొత్తకాదని తేల్చి చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేయటం, గెలవటం తన రక్తంలోనే ఉందని దానం చెప్పుకొచ్చారు. తాను ఎన్నో ఎన్నికలు చూశానని.. ఎన్నో గెలిచానని వివరించారు. కాగా.. సీఎంగా రేవంత్ మరో పదేళ్లు కొనసాగినేతే అభివృద్ధి కొనసాగుతుందని దానం పేర్కొన్నారు.

వర్షాకాలంలో హిమాయత్‌నగర్, నారాయణగూడ వంటి ప్రాంతాల్లో మురుగునీరు రోడ్లపైకి చేరి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు.. ఈ నిధులను ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, కొత్త రోడ్ల నిర్మాణానికి వినియోగించనున్నారు. రూ. 1.40 కోట్ల నిధులతో కొత్తగా రోడ్లు వేయడం, పాత డ్రైనేజీ వ్యవస్థ స్థానంలో మరింత సామర్థ్యం ఉన్న కొత్త పైప్‌లైన్లను ఏర్పాటు చేయడం జరుగుతుంది.ఈ పనుల ద్వారా ప్రజల ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు.. రోడ్లు మెరుగవడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తగ్గుతాయని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే తన ప్రథమ కర్తవ్యమని ఉద్ఘాటించారు. రాజకీయ అంశాల గురించి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశిస్తే.. తాను సిద్ధంగా ఉన్నానని పరోక్షంగా తెలిపారు. తనకు ఎన్నికల పోరాటం కొత్త కాదని, గతంలో 11 సార్లు తాను ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవం ఉందని గుర్తు చేశారు. ప్రస్తుతం తన పూర్తి దృష్టి నియోజకవర్గ అభివృద్ధిపైనే ఉందని.. ప్రజల సమస్యలను పరిష్కరించడానికే ప్రాధాన్యత ఇస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించడమే తన ధ్యేయమన్నారు.

ఇదిలా ఉండగా.. తెలంగాణలో ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై పెద్ద చర్చే నడుస్తోంది. బీఆర్ఎస్‌లో గెలిచి అధికార పార్టీలోకి ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడుతుందా?.. లేదా ఎమ్మెల్యే సభ్యత్వానికి వారే రాజీనామా చేసి ఉప ఎన్నికలకు వెళ్తారా?.. రాజీనామా చేస్తే ఉప ఎన్నికలో వీరే అభ్యర్థులుగా ఉంటారు. మరి అనర్హత వేటు పడితే కూడా వీరికి పోటీ చేసే అవకాశం ఉంటుందా అనే చర్చ మొదలైంది. ఇప్పటికే స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశానికి సంబంధించి సుప్రీం కోర్టు సీరియస్‌గా రియాక్ట్ అయింది. సుప్రీం గడువు అక్టోబర్ 30 తేదీకే ముగియడంతో స్పీకర్ కార్యాలయం మరింత సమయం కావాలని కోర్టును ఆశ్రయించింది. దీంతో, సుప్రీంకోర్టు మరో 4 వారాల సమయం ఇస్తూనే స్పీకర్ కార్యాలయంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే తామే నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం హెచ్చరించింది. అయితే, పార్టీ ఫిరాయించిన అంశంపై అనర్హత వేటు పడితే.. వచ్చే ఉపఎన్నికలో పోటీ చేయడానికి అవకాశం ఉండదు .. అదే అనర్హత వేటు పడకముందే రాజీనామా చేస్తే.. దాన్ని స్పీకర్ ఆమోదిస్తే వచ్చే ఉప ఎన్నికలో పోటీ చేయడానికి అర్హులు అవుతారు.

# కోటి ఎకరాల భూములపై లావాదేవీలు బంద్!

- **తెలంగాణ రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది**
- **కోటి ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చింది**
- **నిషేధిత భూముల జాబితా రూపకల్పనలో అనేక అవకతవకలు**
- **రాష్ట్రంలో ఒక కోటి ఎకరాలకు పైగా నిషేధిత భూముల జాబితాలో**
- **ప్రభుత్వాలు మారినా ప్రజలకు ఉపయోగం లేదనే విమర్శ**
- **రాజకీయ నాయకులు బుట్టలో రెవెన్యూ అధికారులు**
- **ఐజీఆర్ఎస్ వెబ్ పోర్టల్‌లో 22ఏ భూముల జాబితా**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




తెలంగాణ రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. దాదాపు కోటి ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చింది. వీటిపై లావాదేవీలను నిలిపివేసింది. ఈ విషయంలో గతంలోనే హైకోర్టు మొట్టి కాయలు వేసినా తెలంగాణ రెవెన్యూ శాఖ తీరు మారలేదని రైతులు మండిపడుతున్నారు. నిషేధిత భూముల జాబితా రూపకల్పనలో అనేక అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలు సర్వత్రా విన్పిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో 10,510 రెవెన్యూ గ్రామాలలో 22ఏ జాబితాను 96 శాతం ఐజీఆర్ఎస్ వెబ్ పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేశారు. సిరిసిల్ల, వరంగల్, గద్వాల జిల్లాల్లో కొన్ని గ్రామాల వివరాలు అందకపోవడంతో చేర్చలేకపోయారు. వంద శాతం అప్‌లోడ్ అయిన జిల్లాలు 16 ఉండగా, ఏడు జిల్లాల్లో 99 శాతం అప్‌లోడ్ అయ్యాయి. రెవెన్యూ వర్గాల ప్రకారం రాష్ట్రంలో ఒక కోటి ఎకరాలకు పైగా నిషేధిత భూముల జాబితాలో చేర్చారంటున్నారు. అంటే ఈ భూములపై ఎలాంటి లావాదేవీలు జరుపకూడదు. తెలంగాణలో 2.53 కోట్ల ఎకరాల భూమి ఉండగా, ఇందులో 1.53 కోట్ల ఎకరాల వరకు పట్టా భూములు ఉన్నాయి. ప్రభుత్వాలు మారినా ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్ణయం తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైకోర్టు ఆదేశాల పేరుతో అడ్డగోలుగా 22ఏ జాబితాలో చేర్చారని, శాస్త్రీయ విధానం అవలంబించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. నిషేధిత భూముల జాబితాను ఎప్పటికప్పుడు నవీకరించాల్సిన ప్రభుత్వం ఆ బాధ్యతను ఎప్పుడో మర్చిపోయిందంటున్నారు. ప్రభుత్వం ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఈ పని చేస్తే కోర్టులు ఎందుకు జోక్యం చేసుకుంటాయని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ శాఖ నిషేధిత భూముల జాబితా విషయంలో సమీక్షించుకుని, సరి చేయాలని, భవనాలు, బహుళ అంతస్తులు, విల్లాలు వచ్చిన ప్రాంతంలో ప్రజోపయోగ నిర్ణయం తీసుకోవాలని బిల్డర్లు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా తమ ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల ఉసురు పోసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రంగారెడ్డి జిల్లా గోపన్ పల్లిలో ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 1,800 ఎకరాల భూమిని తెలంగాణ రెవెన్యూ శాఖ 22ఏ నిషేధిత జాబితాలో పెట్టింది. ఇక నుంచి ఈ భూములపై శేరిలింగంపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లావాదేవీలు నిర్వహించే అవకాశం ఉండదు. క్రయ విక్రయాలను నిలిపివేయాలని సబ్ రిజిస్ట్రార్ కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తాజా నిర్ణయంతో కొనుగోలుదారులు ఉక్కిరిబిక్కిరికి గురవుతుండగా, నిర్మాణాలు చేపట్టిన బిల్డర్ల పరిస్థితి ఏంటనే ఇంకా అర్థం కావడం లేదు.

రాష్ట్రంలో మొత్తం 10,953 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 10,947 గ్రామాలలో నిషేధిత భూముల జాబితాను సిద్ధం చేసి 10,510 గ్రామాల జాబితాను ఐజీఆర్ఎస్ వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. వంద శాతం అప్‌లోడ్ అయిన జిల్లాలు 16 ఉండగా అందులో యాదాద్రి, సూర్యాపేట, నారాయణపేట, మహబూబ్ నగర్, వికారాబాద్, మేడ్చల్, కుమ్రం భీమ్, కరీంనగర్, భూపాలపల్లి, జనగాం, హైదరాబాద్, హన్మకొండ, అదిలాబాద్, నిర్మల్, ఖమ్మం, పెద్దపల్లి ఉన్నాయి. అయితే ఈసారి హైకోర్టు ఆదేశం ప్రకారం రెవెన్యూ శాఖ 22ఏ భూములపై పూర్తి స్పష్టతనిచ్చింది. 1977 యాక్టు సెక్షన్ 4(1) కింద అసైన్డ్ భూములపై క్రయ విక్రయాలు జరిగితే రిజిస్ట్రేషన్ చేయకూడదు. 1959 భూ బదలాయింపు చట్టం ప్రకారం షెడ్యూల్డు ప్రాంతాల్లో భూములపై నిషేధం కొనసాగుతుందని స్పష్టం చేశారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, మునిసిపాలిటీల్లో అనుమతి లేని లే అవుట్లలో భూముల విక్రయాలపై ఆంక్షలు విధించారు. చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, నాలాలు వంటి వాటికి పది మీటర్ల పరిధిలో ఉన్న భూములపై కూడా నిషేధం అమలులో ఉంటుంది. ప్రజా అవసరాలు, మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం భూ సేకరణ చట్టం కింద సేకరించిన భూములకు 22ఏ వర్తించదు. భారత స్టాంపులు, రిజిస్ట్రేషన్ యాక్టు-1908లో 22ఏ సెక్షన్ ఉంది. ప్రభుత్వ భూములపై లావాదేవీలు జరగకుండా నిరోధించేందుకు 22ఏ సెక్షన్ అమలు చేస్తున్నారు. 22ఏ కింద నోటిఫికేషన్ జారీ చేసిన తరువాత సబ్ రిజిస్ట్రార్లు లేదా మండల తహశీల్దార్లు రిజిస్ట్రేషన్ చేయకూడదు. ఇలాంటి భూములపై ప్రభుత్వం డీ నోటిఫికేషన్ చేస్తే తప్ప రిజిస్ట్రేషన్ చేయడం కుదరదు. అయితే తెలంగాణలో రాజకీయ కక్ష సాధింపులకు 22ఏ ను ఆయుధంగా మలుచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వారసత్వంగా లభించిన భూములను నిషేధిత జాబితాలో చేర్చారని, మండల రెవెన్యూ అధికారులకు ఆమ్యామ్యాలు సమర్పించలేదని, వ్యక్తిగత కక్షతో ఇలా పలు కారణాలతో 22ఏ లో చేర్చారనే విమర్శలు ఉన్నాయి. నిషేధిత భూములపై వివిధ కోర్టుల్లో సుమారు 5వేలకు పైగా పిటీషన్లు దాఖలు అయ్యాయంటే తీవ్రత ఏ స్థాయిలో ఉందో తెలిసిపోతుంది. ఒక్కసారి ఈ జాబితాలోకి భూములు వెళ్తే బయటకు రావడం చాలా కష్టం అని, భూమి యజమాని అష్టకష్టాలు పడాల్సి వస్తున్నదని కోర్టులకు బాధితులు విన్నవించుకున్నారు.

భూముల రిజిస్ట్రేషన్ కు వెళ్లిన సందర్భంలో నిషేధిత జాబితాలో ఉన్నాయంటూ సబ్ రిజిస్ట్రార్లు తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ వేలాది మంది హైకోర్టులో పిటిషన్లు వేశారు. 22ఏ పరిధిలోకి వచ్చే భూముల వివరాలను సబ్ రిజిస్ట్రార్లకు అప్పగించాలని పది సంవత్సరాల క్రితం హైకోర్టు ఫుల్ బెంచి తీర్పు ఇచ్చినా ఎందుకు అమలు చేయలేదని తెలంగాణ రెవెన్యూ శాఖను ప్రశ్నించింది. ప్రజలను ఎందుకు చీకటిలో పెడతారని గట్టిగా మందలించింది. ప్రజలందరూ చూడగలిగే విధంగా ఐజీఆర్ఎస్ వెబ్ పోర్టల్‌లో పెట్టాలని గడువు విధించింది. పలు వాయిదాల అనంతరం ఎట్టకేలకు రెవెన్యూ శాఖ డిసెంబర్ 3వ తేదీన 22ఏ నిషేధిత భూముల జాబితాను ఐజీఆర్ఎస్ వెబ్ పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేసింది.

గోపన్‌పల్లి రెవెన్యూ గ్రామంలో మొత్తం 2,453.38 ఎకరాలు ఉండగా అందులో 75 శాతం భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారు. ఈ వివరాలను ఐజీఆర్ఎస్ వెబ్ పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేయడంతో స్థానికులు లబోదిబోమంటున్నారు. అప్‌లోడ్ డాటా ప్రకారం గోపన్‌పల్లి సర్వే నెంబర్లు 5, 7, 14, 20, 21, 32, 33, 34, 35, 36, 37, 49, 66, 74, 124, 178, 311, 316 నిషేధిత జాబితాలోకి చేర్చారు. సబ్ డివిజన్ నెంబర్లు కూడా చేర్చడం చర్చనీయాంశంగా మారింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పక్కనే ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో విల్లాలు, కాలనీలు, బహుళ అంతస్తలు భవనాలు ఉన్నాయి. హెచ్ఎండీఏ పెద్ద ఎత్తున అనుమతులు మంజూరు చేయడంతో నిర్మాణాలు పూర్తి చేసి విక్రయించారు. భాగ్యనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ, విప్రో, టీసీఎస్ క్యాంపస్, టీఐఎఫ్ఆర్ వంటి ప్రముఖ సంస్థలకు ప్రభుత్వమే భూములు కేటాయించింది. ఇవే కాకుండా తాజ్ నగర్, సోఫా కాలనీ, ఎన్టీఆర్ నగర్, గోపన్ పల్లి తండా లను కూడా చేర్చడం గమనార్హం. బహిరంగ మార్కెట్ లో ఈ భూముల విలువ రూ.20వేల కోట్లకు పైగా ఉంటుందని అంచనా.

వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం అనంతసాగర్ గ్రామంలో శేఖరయ్య అనే రైతు ఉన్నారు. తన కుమార్తెకు కొంత భూమిని అప్పగించేందుకు మీ సేవ కేంద్రంలో రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేసుకునేందుకు ఈ ఏడాది ఆగస్టు నెలలో వెళ్లారు. నిషేధిత జాబితాలో భూమి ఉందని చూపడంతో శేఖరయ్య కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. పట్టాదార్ పాసు పుస్తకంలో 2.33 ఎకరాలు ఉండగా అందులో ఒక సర్వే నెంబర్ లో 1.07 ఎకరాలు పట్టా భూమి, మరో సర్వే నెంబర్ 1.26 ఎకరాలు లవాణి భూమి ఉంది. వాస్తవానికి 1.26 ఎకరాల భూమి చేర్చాల్సి ఉండగా 2.33 ఎకరాలు చేర్చి రైతుకు నిద్ర లేకుండా చేశారు. భారత స్టాంపులు, రిజిస్ట్రేషన్ చట్టం 1908 ప్రకారం ఎప్పటికప్పుడు నిషేధిత భూముల వివరాలను నవీకరించాలి. కాని ఆ పని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాత నిర్వహించలేదు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి సారిగా నవీకరించినప్పుడు తెలంగాణలో ఒక కోటి 90 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలోకి వెళ్లాయి.

22ఏ జాబితా విషయంలో ప్రభుత్వం వివరాలు తెప్పించుకుంటున్నదని తెలుసుకున్న కొందరు అధికారులు, అక్రమార్కులు దందాకు తెరలేపారు. ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి జిల్లాల్లో రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున రంగంలోకి దిగి రెవెన్యూ అధికారులను బుట్టలో వేసుకున్నారు. తమ భూములను రక్షించుకునేందుకు పై స్థాయిలో పైరవీలు చేయించుకుని, ఆమ్యామ్యాలు ముట్టచెప్పి జాబితాలో చేర్చకుండా జాగ్రత్త పడినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లాలో గండిపేట, చేవెళ్ల, మొయినాబాద్, కందుకూరు, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం మండలాల్లో కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను తప్పించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ముట్టచెప్పకోలేని మధ్య తరగతి ప్రజలు, రైతులు బలైపోయారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# 'మోషన్ టాలెంట్ టెస్ట్' టాపర్లకు అవార్డ్స్ పంపిణీ

**టాప్ 10మంది విద్యార్థులకు ఉచిత విద్య**

**విశాలభారతి, హనుమకొండ**




'మోషన్ టాలెంట్ టెస్ట్' టాపర్లకు శుక్రవారం అవార్డ్స్ పంపిణీ చేసినట్లు మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. పరీక్షలో టాప్ 10మంది విద్యార్థులకు ఉచిత విద్య అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. కాగా గత నెల 23న మోషన్ ఐఐటీ, నీట్ కాలేజీ హనుమకొండ బ్రాంచ్ లో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్టులో టాప్ 10 ర్యాంక్ లు సాధించిన విద్యార్థులకు మోషన్ కాలేజీ హన్మకొండ బ్రాంచ్ లో షీల్డ్స్, మెమంటోతో పాటు ఫ్రీ అడ్మిషన్స్ కోసం అగ్రిమెంట్ బాండ్ లను మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అందించారు. ఈ సందర్భంగా టాప్ 10 ర్యాంక్ లు సాధించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అభినందనలు తెలిపారు. ఐఐటీ, నీట్ కోచింగ్ కు దేశంలోనే అగ్రగామి విద్య సంస్థ ఐన మోషన్ ఐఐటీ నీట్ ఇన్స్టిట్యూట్ హన్మకొండ లో బ్రాంచ్ స్థాపించిన మొదటి బ్యాచ్ లోనే అనేక మంది ఐఐటీ, మెడికల్ సీట్లు సాధించి వరంగల్ నగరంలోనే అత్యుత్తమ కాలేజీగా గుర్తింపు పొందింది అని అన్నారు. ఇక్కడ బ్రాంచ్ లో ఐఐటీ, నీట్ కోచింగ్ లో నిష్ణాతులైన సీనియర్ కోటా అధ్యాపకులు, కోటా మెటీరియల్ అందిస్తున్నామన్నారు. మోషన్ టాలెంట్ టెస్ట్ లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఫీజులో 40శాతం రాయితీ ఇస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్స్, మిగితా వివరాల కోసం 9703000850/851/852 నెంబర్ లకు మోషన్ కాలేజీ నయీమ్ నగర్ హన్మకొండ బ్రాంచ్ నందు సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మోషన్ కాలేజీ ప్రిన్సిపాల్ ముత్యాల సురేష్, కోటా అధ్యాపకులు అనూప్ కుమార్, సురేందర్ సాహి, మిథున్, పాఠక్, కాలేజీ సిబ్బంది రాజు, లక్ష్మణ్, మౌనిక, ఉమ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీని ఢీకొడతా..!

**(మొదటిపేజీ తరువాయి)**

వరంగల్ ఎయిర్‌పోర్ట్ కోసం మాజీ సీఎం కేసీఆర్ ఎనాడైనా ఆలోచించారా..? తెలంగాణలో హైదరాబాద్ మినహా ఎక్కడా ఎయిర్‌పోర్ట్ నిర్మించాలన్నా ఆలోచన కేసీఆర్‌కు రాలేదు. మార్చి 31వ తేదీలోపు వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ పనులు ప్రారంభిస్తాం. గడీల పాలనను ప్రజలు కూలగొట్టారు. పదేళ్లలో గత పాలకులు మాత్రమే భారీగా ఆస్తులు సంపాదించారు. వాళ్లు ఆకాశానికి ఎదిగారు తప్ప.. ప్రజలను పట్టించుకోలేదు. వరి పండించండి.. ప్రతిగింజ మేం కొంటాం. రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో అందజేసిన తెలంగాణను.. కేసీఆర్ అప్పులపాలు చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేశారు. రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు అందజేశాం. వచ్చే ఏప్రిల్‌లోపు నర్సంపేటకు 3,500 ఇళ్లు మంజూరు చేస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

'హైదరాబాద్ స్థాయిలో వరంగల్‌ను అభివృద్ధి చేస్తాం. రేషన్ ఇవ్వాలంటే గజ్వేల్‌లో ఫాంహౌస్ రాసిచ్చినట్లుగా కేసీఆర్ ఫీలయ్యారు. కోటి పది లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం. మూడు కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నాం. ఏపీ కంటే అధికంగా వడ్లు పండించిన రాష్ట్రం తెలంగాణ. కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదన్నారు కానీ రైతులకు 24గంటల విద్యుత్ ఇస్తున్నాం. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో వరి పండించాలని చెప్పాం. ప్రపంచానికే పౌరుషాన్ని చాటిన వీరవనితలు సమ్మక్క సారలమ్మ. ప్రజాపాలనకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ విజయోత్సవాలు జరుపుకుంటున్నాం. ఏ ఊళ్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారో అక్కడే బీఆర్ఎస్ నేతలు ఓట్లు అడగాలి... మేము ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన దగ్గర ఓట్లు అడుగుతాం. తరతరాలుగా కుల వృత్తుల బతుకులు మార్చలేదు... చదువు ఒక్కటే పిల్లల భవిష్యత్తు మార్చుతుంది' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



ఇరిగేషన్, ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యం ఇస్తాం. కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తాం. 18 ఏళ్లు పైబడిన ప్రతి ఆడబిడ్డకు చీరలు అందిస్తున్నాం. కోటిమంది ఆడబిడ్డలకు చీర, సారె అందజేస్తాం. ఇందిరమ్మ చీరలకు ఎంత ఖర్చయినా భరిస్తాం. త్వరలో మహిళల ఉత్పత్తులు ఆన్‌లైన్‌లోనూ అమ్మకాలు చేసేలా చర్యలు చేపడతాం. పేదబిడ్డలకు నాణ్యమైన చదువు అందించే బాధ్యత మాది. త్వరలోనే 40 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేస్తాం. నిరుద్యోగులు బాగా చదవండి.. ఉద్యోగాలు సాధించండి. గ్రామాల్లో రాజకీయ కక్షలకు యువత బలికావొద్దు. గ్రామాల్లో రూ.20 వేల కోట్లతో రోడ్లు వేస్తున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

అభివృద్ధి పనులలో ప్రధానంగా రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగింది. ఆధునిక విద్యా ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయి వసతులు పాఠశాలలో ఉంటాయి. పేద మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ఈ స్కూల్ ఏర్పాటు వెనుక ముఖ్య ఉద్దేశం. ఉన్నత విద్య, వైద్య రంగంలో నర్సంపేట కేంద్రంగా మారేందుకు మరో ముఖ్య అడుగు పడింది. రూ.130 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల వసతి గృహాల నిర్మాణం చేపడతారు. అత్యాధునిక సౌకర్యాలతో వైద్య కళాశాల భవనం, విద్యార్థులకు సరిపడా వసతి సదుపాయాలు ఏర్పాటు చేస్తారు. రూ.26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణానికి కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. వైద్య సేవలు మరింత విస్తరించేందుకు.. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఈ రెండు సంస్థలు కీలకం కానున్నాయి. రోడ్డు రవాణా మెరుగుదల కోసం ముఖ్యమంత్రి బహుళ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. రూ.82.56 కోట్లతో హన్మకొండనర్సంపేటమహబూబాబాద్ రోడ్డు విస్తరణ మరమ్మతు పనులు చేపట్టనున్నారు. ఈ రహదారి అభివృద్ధి ద్వారా మూడు ప్రాంతాల మధ్య రాకపోకలు సులభతరం అవుతాయి. ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. అంతేకాక.. రూ.56.40 కోట్లతో నర్సంపేట నుంచి నెక్కొండ రోడ్డు విస్తరణ పనులు, రూ.17.28 కోట్లతో నర్సంపేట - పాఖాల రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమవుతాయి. ఈ విస్తరణ పనులు పూర్తయితే.. వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోగలుగుతారు. నర్సంపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఇది దోహదపడుతుంది. ఈ సందర్భంగా జరిగిన సభలో రాష్ట్ర మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అభివృద్ధి పనుల వేగవంతమైన, నాణ్యతతో కూడిన పూర్తి బాధ్యత అధికారులకు అప్పగించినట్లు ముఖ్యమంత్రి తెలియజేశారు.

## బాలానగర్ పోలీసుల నాకా బంధీ

### రూ. లక్షకు పైగా చలాన్లు వసూలు, 19 వాహనాలు సీజ్

**కూకట్ పల్లి, విశాలభారతి:**




రానున్న నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ లక్ష్యంగా సైబరాబాద్ పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు బాలానగర్ డివిజన్ పరిధిలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నాకా బంధీ నిర్వహించారు. గురువారం రాత్రి బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ గిరి ప్రసాద్ పర్యవేక్షణలో బాలానగర్ సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో రంగారెడ్డి నగర్, రాజు కాలనీ దుర్గామాత గుడి ప్రాంతాలలో రాత్రి 9 గంటల నుండి 12 గంటల వరకు నాకాబందీ చేపట్టారు. ముమ్మర తనిఖీలు.. పెద్ద సంఖ్యలో పోలీసులు ఈ స్పెషల్ డ్రైవ్‌లో బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి పర్యవేక్షణలో ఏకంగా 60 మందికి పైగా పోలీస్ అధికారులు పాల్గొన్నారు. పోలీసులు ప్రధానంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లను విస్తృతంగా తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులపై జరిమానాలు విధించడంతో పాటు కొన్ని వాహనాలను సీజ్ చేశారు.

**రూ. 1,04,095 చలాన్లు వసూలు**

ఈ స్పెషల్ డ్రైవ్‌లో బాలానగర్ పోలీసులు మొత్తం 643 వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో 79 వాహనాలకు సంబంధించిన పెండింగ్ చలాన్ల రూపంలో రూ. 1,04,095 వసూలు చేసినట్లు సీఐ నరసింహా రాజు తెలిపారు. తనిఖీ చేసిన వాహనాల్లో 90 కార్లు, 39 ఆటోలు, 514 ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. అంతేకాక, సరైన పత్రాలు లేని 19 వాహనాలను జప్తు చేసినట్లు సీఐ వెల్లడించారు.

**భవిష్యత్తులోనూ కొనసాగుతాయి**

అనంతరం ఏసీపీ నరేష్ రెడ్డి మాట్లాడుతూ.. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ తరహా తనిఖీలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని స్పష్టం చేశారు. వాహనదారులు విధిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వాహన యాజమానులు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన పత్రాలను కలిగి ఉండాలని, నిబంధనల మేరకు నంబర్ ప్లేటు ఖచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

## బీజేపీ.. బీఆర్ఎస్‌ది ఒకే డ్రామా

- హిల్ట్ పాలసీపై బీఆర్ఎస్ విమర్శలను పొంగులేటి తిప్పికొట్టారు
- సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు
- పాలసీలో రెండు అంశాలు బీఆర్ఎస్ పాలనలో వచ్చాయని స్పష్టం
- ఫైల్‌పై మంత్రిగా కేటీఆర్ సంతకం చేసిన సంగతి మరిచారు
- ముడుపులు తీసుకొని భూములను కన్వర్షన్ చేశారు
- 2026 మార్చి నాటికి 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తవుతుందని వెల్లడి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హిల్ట్ పాలసీపై బీఆర్ఎస్ విమర్శలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తిప్పికొట్టారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన మీడియా సమావేశంలో హిల్ట్ పాలసీపై బీఆర్ఎస్ ఆరోపణలపై విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి పొంగులేటి సమాధానమిచ్చారు. హిల్ట్ పాలసీలో రెండు అంశాలు బీఆర్ఎస్ పాలనలో వచ్చినవే, ఆ ఫైల్‌పై మంత్రిగా కేటీఆర్ సంతకం చేసిన సంగతి మరిచారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో కోకాపేట, నియోపోలిస్ ప్లాట్లు వేలం వేశారు, హిల్ట్‌ను దోపిడీ పాలసీ అంటున్న కేటీఆర్‌కు ఇవి గుర్తులేవా అని మండిపడ్డారు.

ఓఆర్ ఆర్ నిర్వహణను కూడా వేలం వేశారు. అయ్య ముఖ్యమంత్రిగా కొడుకు పరిశ్రమల శాఖ మంత్రిగా కావలసిన వారి దగ్గర ముడుపులు తీసుకొని భూములను కన్వర్షన్ చేశారని ఆరోపించారు.



ప్రభుత్వ భూములు వేలం వేశారు. పరోక్షంగా, ప్రత్యక్షంగా వేలాది ఎకరాలు వేలం వేశారు.ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌బి నగర్‌లోని దాదాపు 40 ఎకరాల స్థలాన్ని పివి రాజు ఫార్మా కంపెనీకి లీజుకు ఇవ్వడం జరిగింది. అక్కడ కెమికల్ ఫ్యాక్టరీ తోటి భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని అక్కడి ప్రజలు ఆందోళన కూడా చేశారు. ఈ కెమికల్ ఇండస్ట్రీని రెసిడెన్షియల్ జోన్‌గా మార్చింది బిఆర్ఎస్ పార్టీనేనన్నారు. ఈ ఫైలుపై అయ్య కొడుకులు సంతకాలు చేశారని పొంగులేటి అన్నారు. ఏ పాలసీతో ఈ కన్వర్షన్ చేశారు. ఐడిపిఎల్ లో కూడా ఇదే విధంగా చేశారు. కేటీఆర్ కడుపు నిండా విషమేఉంది. విషం కక్కడానికి కూడా ఒక హద్దు, అదుపు, పద్ధతి ఉంటుంది. కేటీఆర్ ది కడుపుమంట. విషపూరితమైన ఆలోచన. హిల్ట్ పాలసీపై బీజేపీ , బీఆర్ఎస్‌ది ఒకే డ్రామా. స్క్రిప్ట్ రాసేది ఒకరు. డెలివరీ చేసేది మరొకరు అని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూసేవారికి శుభవార్త అందించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభమవుతుందని తెలిపారు. త్వరలో లక్ష ఇళ్లకు గృహప్రవేశం చేస్తామని, వచ్చే ఏడాది మార్చి నాటికి 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తవుతుందని వెల్లడించారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టామని, త్వరలో అర్బన్ ప్రాంతాల్లో కూడా నిర్మాణాలు చేపడతామని ప్రకటించారు. గ్రౌండ్ ప్లస్ ఫోర్ బిల్డింగ్ విధానంలో ఇళ్లు నిర్మించి పేదలకు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇక ఓఆర్ఆర్‌ను అనుకుని నలువైపులా ఉన్న స్థలాల్లో ఒక్కోచోట 10 వేల ఇల్లు నిర్మించి నో ప్రాఫిట్, నో లాస్ విధానంలో మధ్యతరగతి ప్రజలకు అందిస్తామన్నారు. త్వరలో అర్బన్ ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించే విషయంపై దృష్టి పెడతామని, అందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పొంగులేటి పేర్కొన్నారు.

ఇల్లు నిర్మించుకునేందుకు స్థలం లేని పేదలకు కూడా త్వరలోనే శుభవార్త అందుతుందని పొంగులేటి అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రభుత్వంపై పొంగులేటి విమర్శలు కురిపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో హౌసింగ్ శాఖ పూర్తిగా భ్రష్టు పట్టిపోయిందని, వాళ్లు మధ్యలో వదిలేసిన ఇళ్లకు కూడా ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తింపచేస్తామన్నారు. ఒకే విడతలో ఇల్లు ఇచ్చి తాము చేతులు దులుపుకోమని, అర్హులైన వారందరికీ ఇల్లు నిర్మిస్తామన్నారు. అటు హిల్ట్ పాలసీపై కేటీఆర్ మాటలు అడ్డగోలుగా ఉన్నాయని, నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. వినూత్న నిర్ణయాలతో తాము ముందుకెళ్తున్నామని, కేసీఆర్ ప్రభుత్వంలా తాము చేయమని పొంగులేటి స్పష్టం చేశారు.

## రాసి పెట్టుకోండి.. వచ్చేది మన ప్రభుత్వమే

**(మొదటిపేజీ తరువాయి)**

ఆలోచనలతో తమ గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రణాళికలు రచించుకోవాలన్నారు. గంగదేవిపల్లి లాంటి అభివృద్ధి చెందిన స్వయం సహాయక గ్రామాలను ఆదర్శంగా తీసుకొని, ప్రజల భాగస్వామ్యంతో కమిటీలు వేసుకొని, మన పని మనం చేసుకుంటూ, మన పల్లె అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఎవరో ఏదో చేస్తారని ఏదో ఇస్తారని ఆశలు పెట్టుకొని ఆగం కావద్దు.." అని కేసీఆర్ తెలిపారు. జాతీయ అంతర్జాతీయంగా పల్లెల ప్రగతి కోసం గొప్ప వ్యక్తులు చేసిన కృషి గురించి కేసీఆర్ వివరించారు. బంగ్లాదేశ్ కు చెందిన సామాజిక ఆర్థికవేత్త, స్వయం సహాయక బృందాల ఏర్పాటు కు స్ఫూర్తి దాత, ప్రొఫెసర్ యూనిస్, అన్నా హజారే లాంటి దార్శనికుల గురించి వారి కృషిని వివరించారు. వారిని ఆదర్శంగా తీసుకుని గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం అందించిన స్ఫూర్తితో తమ పల్లెలను సామాజిక ఆర్థిక స్వయం సమృద్ధి కేంద్రాలుగా తీర్చి దిద్దుకోవాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.

తెలంగాణ సీఎంగా తాను దత్తత తీసుకున్న, తన గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని, ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామాల నూతన సర్పంచులు.. వార్డు మెంబర్లు శుక్రవారం కేసీఆర్ ని మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. వారిని తన నివాసానికి సాదరంగా ఆహ్వానించి, గ్రామస్థుల సమష్టి మద్దతుతో ఎన్నికైన సర్పంచులను శాలువాలతో సత్కరించిన కేసీఆర్ వారికి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా తన వద్దకు వచ్చిన గ్రామస్థులను, గుర్తుపట్టి పేరు పేరునా పలకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో వాతావరణం, మౌలిక వసతుల అందుబాటు, పండుతున్న పంటల పరిస్థితి గురించి పేరు పేరునా అడిగి కేసీఆర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ... తెలంగాణలో గత బీఆర్ఎస్ పాలనలో గొప్పగా వర్ధిల్లిన గ్రామాల పరిస్థితిని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని రకాలుగా దిగజారిన పరిస్థితిని, గ్రామస్థులు కేసీఆర్ దృష్టికి తెచ్చి ఆవేదన వ్యక్తం చేశారు.



నాడు విద్యుత్ సాగునీరు సహా వ్యవసాయాభివృద్ధికి కేసీఆర్ సీఎం గా అందించిన సహకారం, పల్లె ప్రగతికి కేసీఆర్ ప్రభుత్వం క్రమం తప్పకుండా విడుదల చేసిన నిధులు, గొల్ల కురుమ, ముదిరాజ్ బెస్త, గౌడ, పద్మశాలి సహా చాకలి మంగలి సబ్బండ కుల వృత్తులకు, దళిత బహుజన గిరిజన మహిళల కోసం ప్రత్యేకంగా అమలు చేసిన పథకాలు, అందించిన ఆర్థిక సాయం... గురించి చర్చిస్తూ స్మరించుకున్నారు. క్రమం తప్పకుండా ఆసరా సహా సకల రకాల పింఛన్లు అందిన ఆర్థిక సహకారంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎంత గొప్పగా ఫరిడ విల్లిందో.... చర్చ జరిగింది. అనంతరం నూతనంగా ఎన్నికైన ఎర్రవెల్లి గ్రామ సర్పంచి, నారన్నగారి కవితా రామ్మోహన్ రెడ్డి దంపతులు, ఉప సర్పంచ్ ఎడ్మ సబితా కరుణాకర్, వార్డు మెంబర్లు, నర్సన్న పేట గ్రామ సర్పంచ్ గిలక బాల నర్సయ్య, వార్డు మెంబర్లను కేసీఆర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి తదితరులున్నారు.

"సార్ తమరి హయాం మా పల్లెలకు సువర్ణ యుగం.. ఇప్పుడేముంది సార్.. గోస మిగిలింది అని గ్రామస్థుడు అన్నారు. అన్ని కులాలు అరిగోస పడుతున్నయి. ఏదైనా...పోగొట్టుకున్నంకనే అర్థమైతది.. సార్. మీరు ఉన్నప్పుడు తెల్వలె మీ విలువ.. ఇప్పుడు అర్థమైతాంది. మల్ల మీరొస్తే తప్ప తెలంగాణ పల్లెలకు మునుపటి కళ రాదు.. మల్ల మీరే రావాలే... వస్తారు.. కాంగ్రెస్ ప్రభుత్వం ల ఇగ మాగ్గూడ రోండెండ్లకే సరిపోయింది సార్..." అని అన్నారు. కాగా ఆయన వివరించినప్పుడు బాధతో పాటు నవ్వులు విరిసాయి.

ఇక 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన తర్వాత కేసీఆర్ సీఎం పదవిని కోల్పోయారు. అనంతరం ఆయన పెద్దగా పబ్లిక్‌గా కనిపించలేదు. 2023 డిసెంబర్ 4న గజ్వేల్‌లో తన ఫార్మ్‌హౌస్‌లో పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఆపై 2025 జూన్ 11న, కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై జరుగుతున్న జ్యుడీషియల్ కమిషన్ ముందు కేసీఆర్ హాజరయ్యారు. ఇలా చాలా అరుదుగానే కేసీఆర్ బయటకొస్తున్నారు. తాజాగా తెలంగాణలో పలు గ్రామ పంచాయతీలలో బీఆర్ఎస్ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లతో కేసీఆర్ సమావేశం అవ్వడమే కాకుండా వారిలో జోష్ నింపే ఞయత్నం చేశారు.

# మన స్నేహం ఎప్పటికీ శాశ్వతం

- భారత్, రష్యా ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపోతం
- 23వ ఇండియా-రష్యా సమ్మిట్‌లో పీఎం మోదీ, పుతిన్
- 2030 వరకు ఆర్థిక సహకార ప్రణాళికపై ఒప్పందం
- ఇంధన భద్రత, ఉగ్రవాద నిర్మూలన, టూరిజం అంశాలపై చర్చలు
- రష్యా నుంచి స్థిరమైన ఆయిల్, గ్యాస్, కోల్ సరఫరా
- బిగ్ సెవెన్ కూటమిపై పుతిన్ విమర్శలు గుప్పించారు

**విశాలభారతి, నేషనల్:**



భారత్ , రష్యా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడుతున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రష్యన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 23వ ఇండియారష్యా సమ్మిట్‌లో పాల్గొన్నారు. 2030 వరకు ఆర్థిక సహకార ప్రణాళికపై ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సమ్మిట్ 25 సంవత్సరాల క్రితం పుతిన్ భాగస్వామ్యానికి పునాది వేసిన సందర్భంలో జరిగింది. ఉమ్మడి మీడియా సమావేశంలో మోదీ, ఈ స్నేహాన్ని మారుతున్న ప్రపంచంలో " నార్త్ స్టార్" గా పేర్కొన్నారు. ఆర్థిక సహకారం, ఇంధన భద్రత, ఉగ్రవాద నిర్మూలన, టూరిజం వంటి అంశాలపై చర్చలు జరిగాయి.

ఈ సమ్మిట్ భారత్‌రష్యా సంబంధాల చరిత్రలో మరో ముఖ్య అధ్యాయం. గత 80 సంవత్సరాలలో ప్రపంచం ఎన్నో ఆందోళనలు ఎదుర్కొన్నప్పటికీ, రెండు దేశాల మధ్య స్నేహం పరస్పర గౌరవం, విశ్వాసంపై ఆధారపడి స్థిరంగా ఉందని జాయింట్ స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు. ప్రపంచ వ్యవస్థలు మారుతున్నా, ఈ భాగస్వామ్యం మార్గదర్శకంగా ఉందని మోదీ అన్నారు. సమ్మిట్‌లో ఆర్థిక, రక్షణ, శక్తి, సాంస్కృతిక అంశాలపై విస్తృత చర్చలు జరిగాయి.

భారత్‌రష్యా దేశాలు 2030 వరకు బహుముఖ ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేయడానికి ప్రణాళిక రూపొందించాయి. గత సంవత్సరం ద్వైపాక్షిక వాణిజ్యం 12శాతం వృద్ధి చెంది, కొత్త రికార్డు స్థాపించింది. ఈ సంవత్సరం కూడా అదే స్థాయిలో ఉంటుందని పుతిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు దేశాలు వారి వారి దేశాల కరెన్సీలలో చెల్లింపులు చేయనున్నారు. డాలర్‌కు చెక్ పెట్టనున్నారు. భారత్ శక్తి అవసరాలకు రష్యా నుంచి స్థిరమైన ఆయిల్, గ్యాస్, కోల్ సరఫరా. సివిల్ న్యూక్లియర్ ఎనర్జీలో దశాబ్దాల సహకారం క్లీన్ ఎనర్జీకి దోహదపడుతోంది. క్రిటికల్ మినరల్స్ విషయంలో సహకారం కొనసాగుతుంది. ఈ ప్రణాళిక రెండు దేశాల ఆర్థిక వృద్ధికి, ప్రపంచ శక్తి భద్రతకు బలమైన పునాది వేస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ప్రెసిడెంట్ పుతిన్ తన స్నేహితుడని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచం గత ఎనిమిది దశాబ్దాలలో ఎన్నో ఆందోళనలు చూసింది. అయితే, భారత్ మరియు రష్యా మధ్య స్నేహం ఉత్తర తారలా ఉంది. ఈ సంబంధం పరస్పర గౌరవం , విశ్వాసంపై ఆధారపడి ఉంది... ఈ రోజు మనం ఈ సంబంధాన్ని బలోపేతం చేయడానికి అన్ని అంశాలపై చర్చలు జరిపామని తెలిపారు. శక్తి భద్రత మన భాగస్వామ్యంలో బలమైన స్తంభం, మనం ఈ విన్‌విన్ సహకారాన్ని కొనసాగిస్తాము. మన సివిల్ న్యూక్లియర్ ఎనర్జీలో దశాబ్దాల సహకారం క్లీన్ ఎనర్జీకి దోహదపడింది. క్రిటికల్ మినరల్స్‌లో మన సహకారం ప్రపంచ సరఫరా గొలుసును విభిన్నంగా మరియు నమ్మకంగా ఉంచడానికి అవసరం అని పేర్కొన్నారు.

వృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థ కోసం ఇంధనాల అంతరాయం లేని సరఫరాను కొనసాగిస్తామని పుతిన్ హామీ ఇచ్చారు. గత సంవత్సరం మన ద్వైపాక్షిక వాణిజ్య ఆవిర్భావం 12 శాతం వృద్ధి చెందింది, కొత్త రికార్డు స్థాపించింది. మేము ఈ సంవత్సరం వాణిజ్య ఒప్పందం అదే ఆకర్షణీయ స్థాయిలో ఉంటుందని చెప్పారు. ప్రధాన మంత్రి మన రెండు ప్రభుత్వాలకు ప్రయోజనమైన అంశాలపై జాబితా ఇచ్చారని వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. మన దేశాలు జాతీయ కరెన్సీలలో పరస్పర సెటిల్‌మెంట్లకు క్రమంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా రెండు దేశాలు పోరాడుతాయన్నారు. రష్యా నుంచి భారత్‌కు ఇంధనాల స్థిరమైన సరఫరా, రక్షణ సహకారం, సాంస్కృతిక బంధాలు ఈ సంబంధాన్ని మరింత బలపరుస్తున్నాయి. పుతిన్ పర్యటనలో చేసుకున్న ఈ ఒప్పందాలు భారత్ ఆర్థిక వృద్ధికి, రష్యా ఎక్స్‌పోర్ట్‌లకు ఊరట ఇస్తాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

చర్చలకు ముందు ఇచ్చిన ఇంటర్వ్యూలో పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. మాస్కో, న్యూఢిల్లీ మధ్య సహకారం ఏ పశ్చిమ దేశ వ్యతిరేక కూటమిలో భాగం కాదని ఆయన స్పష్టం చేశారు. "తమకు ఒత్తిడి ఎదురవుతున్నప్పటికీ.. మేం, ప్రధాని మోదీ ఎప్పుడూ ఎవరికో వ్యతిరేకంగా పని చేయడానికి సహకారాన్ని పెంచుకోలేదు" అని పుతిన్ అన్నారు. ఈ భాగస్వామ్యం వైరుధ్యాలపై కాకుండా పరస్పర ప్రయోజనాలపై ఆధారపడి ఉందని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా జీ7 ("బిగ్ సెవెన్") కూటమిని పుతిన్ విమర్శిస్తూ.. కొనుగోలు శక్తి సమానత్వం పరంగా భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉండగా, యూకే 10వ స్థానంలో ఉందని గుర్తు చేశారు.

ఢిల్లీ హైదరాబాద్ హౌస్ లో ప్రధాని మోదీ, వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగిన వ్యూహాత్మక చర్చల అనంతరం ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. ఇది ఇరు దేశాల మధ్య పర్యాటక రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. ఢిల్లీలో జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోదీ ఈ వీసా పథకం వివరాలను వెల్లడించారు. రష్యన్ పౌరుల కోసం ఈటూరిస్ట్ వీసాలు, గ్రూప్ టూరిస్ట్ వీసాల సేవలను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ వీసా దరఖాస్తులను ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు లేకుండా 30 రోజులలోపు ప్రాసెస్ చేస్తారని స్పష్టం చేశారు. ఈ వీసా సేవలన్నీ కూడా ఉచితంగా లభిస్తాయని అన్నారు.

జాయింట్ ప్రెస్ మీట్ సందర్భంగా ఇరు దేశాలు 'విజన్ 2030' డాక్యుమెంట్ ను కూడా ఆవిష్కరించాయి. ఇది దీర్ఘకాలికంగా ఇరు దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని పెంపొందించడానికి, వాణిజ్యం, పెట్టుబడి, సాంకేతికత రంగాల్లో సంపూర్ణ సహకారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికి వ్యూహాత్మక రోడ్‌మ్యాప్ గా ఉపయోగపడుతుందని మోదీ వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం కొత్త వ్యాపార అవకాశాలను సృష్టిస్తుందని, తద్వారా ఇరు దేశాలు భారత్‌రష్యా బిజినెస్ ఫోరంలో భాగస్వామ్యం అవుతాయని తెలిపారు. ఆర్థిక సహకారాన్ని మరింత పెంపొందించడానికి విజన్ 2030 డాక్యుమెంట్ పై సంతకం చేశామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యూరేషియన్ ఎకనామిక్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కూడా సాకారం చేసుకోవడానికి అంగీకరించామని అన్నారు. ఈ సందర్భంగా పుతిన్ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనతో ఇరు దేశాల ద్వైపాక్షిక అజెండాను మరింత బలోపేతమౌతుందని చెప్పారు.

## ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలు అందించాలి

**బోధన్ శాసనసభ్యులు, ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు పొద్దుటూరు సుదర్శన్ రెడ్డి**



**బోధన్ టౌన్, విశాలభారతి:** బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రాంతంలో గల లయన్స్ క్లబ్ ఆసుపత్రి ఆవరణలో నూతనంగా ప్రారంభించబోయే లయన్స్ జనరల్ ఆస్పత్రిని శుక్రవారం రోజు బోధన్ శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర ముఖ్య సలహాదారుడు ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని పేద ప్రజల కొరకు ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మర్యాదపూర్వకంగా లైన్స్ సేవలు అందించేందుకు లైన్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జనరల్ ఆస్పత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ ఆస్పత్రిలో ఎండి జనరల్ ఫిజీషియన్ ముగ్గురు ఎంబిబిఎస్ వైద్యులు ఇద్దరు తోపాటు నర్సింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశారని తెలిపారు. నామమాత్రపు ఫీజు తో రోగులకు వైద్యం అందిస్తారని ఈ అవకాశాన్ని బోధన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు బసవేశ్వర రావు, కొడాలి కిషోర్, నాగేశ్వరరావు, నాయకులు గంగా శంకర్, బోధన్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు నరసింహారెడ్డి, విజయ్ కుమార్, బోధన్ లైన్స్ క్లబ్ ప్రతినిధులు ఉన్నారు

## ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసిన కాంగ్రెస్ నాయకులు



**నిజామాబాద్, విశాలభారతి:** మాక్లూర్ మండలం మాణిక్ బండారు గ్రామంలో మన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గారు మరియు టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ ఇల్లు,, కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ ఇంచార్జ్ వినయ్ రెడ్డి ఆదేశాల మేరకు, నిజామాబాద్ జిల్లా ( మాజీ) డిసిసి జనరల్ సెక్రెటరీ, జి పురుషోత్తం, ఆధ్వర్యంలో మరియు కాంగ్రెస్ పార్టీ విలేజ్ అధ్యక్షులు టి.ఎన్.రెడ్డి అధ్యక్షతన, ఇందిరా అమ్మాయిలకు ముగ్గు వేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కే రాజేశ్వర్, జి శేఖర్, రాయి సింగ్, ఏం బాబు, ఎన్ సాగర్, మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, జి స్వామి, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజలు ఆశీర్వదిస్తే గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాం



**తొర్రూరు, విశాలభారతి:** కంఠయపాలెం గ్రామ ప్రజలు ఆశీర్వదిస్తే గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మోకాటి సుజాత వెంకన్న అన్నారు.కంటయపాలెం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా టిపిసిసి ఉపాధ్యక్షురాలు,కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి,పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డిలు మోకాటి సుజాత వెంకన్నను బలపరచడంతో శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల్లో గ్రామ ప్రజలు ఆశీర్వదిస్తే గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.తనను గెలిపిస్తే గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానన్నారు. గ్రామంలో ఎవరికి ఆపద వచ్చినా కష్టం వచ్చినా ఆదుకుంటానన్నారు. ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డిల సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాలం ఉపేందర్,మందపురి కుమారస్వామి ,ఎనగందుల శ్రీనివాస్, గోనే ప్రవీణ్,బానోత్ నరసింహ నాయక్,సాయిలు, ఇదునూరి యాకయ్య,మార్క వెంకన్న,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మండల పాస్టర్స్ నూతన కమిటీ ఎన్నిక



**కోదాడ, విశాలభారతి:** మునగాల మండల పరిధిలో యేసుక్రీస్తు సేవ చేస్తున్న పాస్టర్స్ నూతన కమిటీని కోదాడ నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ డా జె. సుదర్శనం ఆధ్వర్యంలో మునగాల మండల పరిధిలోని విజయరాఘవపురం గ్రామంలోని పాస్టర్ గోదేశి రత్నరాజును శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోదాడ నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ కోర్ కమిటీ ఛైర్మన్ రెవ డా కె. శ్రావణ్ కుమార్, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ రెవ డా కె. జోసెఫ్ ల ఆధ్వర్యంలో ఎన్నికైన కమిటీని ప్రకటించారు. మండల గౌరవ అధ్యక్షులుగా గోదేశి రత్నరాజు, అధ్యక్షులుగా ఆర్. సిల్వరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం. రాజేష్, కోశాధికారిగా డి. వసంత్ కుమార్, ఉపాధ్యక్షులుగా జె. పరిపూర్ణయ్య, జాయింట్ సెక్రటరీగా లాజరస్, కోఆర్డినేటర్ గా ఎం.డి యాకూబ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా అబ్రహాంరాజు, హున్యానాయక్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ రెవ ఆర్. ప్రకాష్, జిల్లా మీడియా కన్వీనర్ జె జె సామ్యూల్ సన్, సీ.హెచ్. ఆదాము, పి. డేవిడ్ రాజు, జె. లూకా, బి. సామ్యూల్ పీటర్, మహేష్ పాల్, జాషువారాజు, ప్రేమానందం, మోషే, రక్షకన్, ఓబద్యా , జె. సామ్యూల్, ఎం. లూకా, జాబెజ్, జాషువా తదితరులు పాల్గొన్నారు.

## పినపాకలో పర్యటించనున్న మంత్రి సీతక్క



**మణుగూరు, విశాలభారతి :** పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క శనివారం పినపాక మండలంలో పర్యటించనున్నారు. మల్లారం గ్రామ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి చందా వరప్రసాద్ గెలుపుకోసం ఆమె ప్రత్యేకంగా ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలియజేశాయి. గ్రామంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలని లక్ష్యంగా మంత్రి సీతక్క, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఇంటింటి ప్రచారంతో పాటు ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. చందా వరప్రసాద్ అభ్యర్థిత్వానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్న నేపథ్యంలో, సీతక్క పర్యటన మరింత ఉత్సాహాన్ని నింపనుందని నాయకులు తెలిపారు. పార్టీ గెలుపుకోసం కీలకమైన ఈ ప్రచారంలో గ్రామస్థులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# రేషన్ బియ్యం పక్కదారి

- రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తున్న సిబ్బంది
- డీలర్ల తో కుమ్మక్కైనకిలీ ఎంట్రీలు చేస్తున్నట్లు గుర్తింపు
- ప్రతి లారీకి 50 వేల చొప్పున వసూళ్లు
- విలేకరుల సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్



**కొత్తగూడెం, విశాలభారతి:** రేషన్ బియ్యం గుట్టుగా పక్కదారి పడుతోంది,నేరుగా రేషన్ దుకాణాలు,బ్ధిదారుల నుండి కొందరు వ్యక్తులు కొనుగోలు చేసి వాటిని వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారనే విషయం తెలిసినదే ఐనప్పటికీ అదే అదునుగా భావించిన సివిల్ సప్లై సిబ్బంది ఈ దారుణానికి పాల్పడుతున్నట్లు నేడు జరిగిన సంఘటన తో బట్టబయలైంది. లారీకి నకిలీ రసీదుల కోసం ఎం ఎల్ ఎస్ సిబ్బంది లంచాలు స్వీకరించి తప్పుడు వివరాలను ఎంట్రీలు చేసి ఈ విధంగా ఘరానా మోసానికి పాల్పడుతున్నట్లు అధికారులు ఎట్టకేలకు గుర్తించారు. ఎం ఎల్ ఎస్ స్టాక్ పాయింట్ సిబ్బంది పిడిఎఫ్ డీలర్లు కూడా ఇందులో ప్రమేయం ఉన్నట్లు అవుతుంది ప్రతి లారీకి 50 వేల చొప్పున వసూలు చేసి ఐదు మార్లు పంపినట్లు స్పష్టం అవుతుంది. పిడిఎఫ్ బియ్యం మళ్లించేందుకు జిపిఎస్ ట్రాకింగ్ వ్యవస్థను మార్చి లారీలను మణుగూరుకి చెందిన రైస్ మిల్లర్ నరహరి కి తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నిరుపేదలు దారిద్ర రేఖకు దిగువన ఉన్న వారి కోసం ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తుంటే ఆ బియ్యాన్ని కూడా పందికొక్కుల్లా మారి అదే శాఖలో పనిచేస్తున్న సిబ్బంది ఈ దారుణానికి పాల్పడడంతో జిల్లా ప్రజలు ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఇంటి దొంగలను ఈశ్వరుడైన పట్టలేడు అనే సామెతను వీరంతా నిజం చేశారని ఎట్టకేలకు అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవడం బావుందంటూ ప్రశంసిస్తున్నారు. జిల్లాలో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాపై చేపట్టిన ప్రత్యేక కార్యాచరణ వివరాలను జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. అదనపు కలెక్టర్ వెల్లడించిన వివరాలు ఇలావున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాపై విశ్వసనీయ సమాచారంతో తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ టాస్క్ ఫోర్స్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అధికారులు ఈనెల 2 న సాయంత్రం సుమారు 4:15 గంటల సమయంలో జి.సి.సి.ఎస్ మాండల్ లెవల్ స్టాక్ పాయింట్ (ఎంఎల్ఎస్ పాయింట్), పాల్వంచలో నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీ 20 ఏవి 1899 (బజాజ్ పల్సర్) నెంబర్ గల మోటార్ సైకిల్‌పై వచ్చిన యువకుడు త్వరలోనే స్టాక్ పాయింట్‌లోకి ప్రవేశించి, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్ సత్యవతి, డేటా ఎంట్రీ ఆపరేటర్ బనోత్ కృష్ణకుమార్‌కు పత్రాలు అందజేయగా, వారు కొంత సమాచారం నమోదు చేసి తిరిగి ఆయనకు అందించారు. ఈ పరిణామంపై అనుమానంతో అధికారులు ప్రధాన గేటు వద్ద అతడిని ఆపి విచారించగా, అతడి పేరు ప్రశాంత్ అని, ఆయన స్టేజ్-I కాంట్రాక్టర్ ఎన్. శ్రీనివాస్‌కు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్లు వెల్లడించాడు.

ప్రసాంత్ వెల్లడించిన వివరణ ప్రకారం, వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామ్, మల్లారం నుండి సరఫరా కావాల్సిన పిడిఎస్ 'సన్న బియ్యం'ను, మోటార్ సైకిల్ ద్వారా జీపీస్ ట్రాకింగ్ వ్యవస్థను మార్చి, లారీ నం. టిఎస్ 29 టి 5139కు సంబంధించిన ట్రాక్ చిట్ నంబర్ 4346తో కలిసి జి.సి.సి. స్టాక్ పాయింట్‌కు తెచ్చి, అక్కడ ఎంఎల్ఎస్ పాయింట్ సిబ్బంది కలయికతో నకిలీ ఎంట్రీలు చేసి తిరిగి పంపారని నిర్ధారించారు. దీంతో అసలు లారీలో ఉన్న 600 సంచుల పిడిఎస్ బియ్యం (300 క్వింటాళ్లు) నల్లబజారుకు మళ్లించినట్లు తేలింది. ఈ వ్యవహారంలో ఎంఎల్ఎస్ పాయింట్ సిబ్బంది, పిడిఎస్ డీలర్లు కలిసి పత్రాలలో తప్పుడు నమోదు చేసి ప్రభుత్వానికి భారీ ఆర్థిక నష్టం కలిగించారు. పంచనామా,స్వీకార వాంగ్మూలాల ఆధారంగా ప్రసాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సమావేశంలో డిసిఓ ప్రేమ్ కుమార్, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, అంజయ్య ఓ ఎస్ డి తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ ప్రాచీన వైద్య విధానాలకు పూర్వవైభవం తథ్యం: ఆలే శ్యామ్ కుమార్






- కొండాపూర్ రాజరాజేశ్వర నగర్‌లో ఆయుఃవృద్ధి వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభం
- అందుబాటులోకి హోమియో, న్యూట్రిషనల్, యోగ, మ్యూజిక్ థెరపీలు

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** భారత్ లో ప్రాచీన వైద్య విధానాలకు తిరిగి ఆదరణ లభిస్తుండటం శుభ సూచకమని అఖిల భారత ధర్మ జాగరణ సహ ప్రముఖ్ ఆలే శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ రాజరాజేశ్వర నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయుఃవృద్ధి హోమియోపతిక్ అండ్ వెల్‌నెస్ క్లీనిక్ ని ఆయన లాంఛనంగా ప్రారంభించి, సంస్థ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయుఃవృద్ధి వ్యవస్థాపకురాలు డాక్టర్ సింధు బైరవి, ఫైనాన్స్ డైరెక్టర్ మనోహరి, మ్యూజిక్ థెరపిస్ట్ వశిష్ట రామ్, సలహాదారులు చింతకింది గోవర్ధన్ గౌడ్ లను ఆలె శ్యామ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. శేరిలింగంపల్లి ప్రాంత వాసులకు అధునాతన హోమియోపతి సేవలతో పాటు న్యూట్రిషనల్, యోగ, మ్యూజిక్ థెరపిలను అందుబాటులోకి తీసుకురావడం ఆహ్వానించదగ్గ విషయమని అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఒకవేళ అనారోగ్యం బారిన పడ్డప్పుడు ప్రాథమిక దశలోనే ఆయుర్వేదం, హోమియోపతి లాంటి సాంప్రదాయ వైద్యంను ఎంచుకోవాలని సూచించారు. భారతీయ జీవన విధానంలో ప్రాచీన వైద్య విధానాలు ఎన్నో అందుబాటులో ఉండేవని అందులో విశిష్టమైనది మ్యూజిక్ థెరపీ అని అన్నారు. రాగాలను ఉపయోగించి రోగాలను నయం చేసే ప్రాచీన పద్ధతి కాలక్రమంలో కనుమరుగైనప్పటికీ ఇటీవల మళ్లీ ప్రాధాన్యతను సంతరించుకోవడం గొప్ప విషయమని అన్నారు. కరోనా తర్వాత మన ప్రాచీన సాంప్రదాయ వైద్య విధానానికి తిరిగి ఆదరణ లభిస్తుండడం, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కడం మనకెంతో గర్వకారణమని అన్నారు. వెల్‌నెస్ సెంటర్ లోని వివిధ విభాగాలను అతిథులుగా విచ్చేసిన రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నందకుమార్ యాదవ్, ఎస్ బిఐ రిటైర్డ్ ఏజిఎం బాల్ద అశోక్, యోగా శిక్షకులు, సీనియర్ జర్నలిస్ట్ పుట్ట వినయ్ కుమార్ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త రాఘవేంద్రరావులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, ప్రజా, సంక్షేమ సంఘాల నాయకులు, స్థానికులు హోమియో వైద్య ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రికార్డు స్థాయిలో విద్యుత్ వసూళ్లు

- ఎన్‌పీడీసీఎల్‌లో తొర్రూర్ దే అగ్రస్థానం



**తొర్రూరు, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని మొత్తం 40 డివిజన్లలో, ఎల్.టి. కేటగిరీ 1 (ప్రైవేట్ సర్వీసులు) విద్యుత్ వసూళ్లలో తొర్రూరు డివిజన్ 108 శాతం కలెక్షన్స్ సాధించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు డివిజనల్ ఇంజనీర్ బి.రవి హర్షం వ్యక్తం చేశారు.ఈ విజయం ఇంజనీర్లు, ఓ&ఎం సిబ్బంది,అకౌంట్స్ స్టాఫ్ సమిష్టి కృషి వల్లే సాధ్యమైందని, వారందరికీ ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.అలాగే సకాలంలో బిల్లులు చెల్లించి సంస్థకు సహకరించిన వినియోగదారులకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా బిల్లులు చెల్లించని వారు వెంటనే చెల్లించి సంస్థ పురోగతికి తోడ్పడాలని కోరారు.సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి సమస్యలున్నా (స్తంభాలు వంగినా, తుప్పు పట్టిన వైర్లు ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల గద్దె ఎత్తు తక్కువగా ఉన్నా, లోవోల్టేజీ సమస్యలున్నా) వెంటనే స్థానిక ఏఈ, ఏడిఈ దృష్టికి తీసుకురావాలని డిఈ సూచించారు.వీటిని దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**ప్రజావాణి మరియు టోల్ ఫ్రీ నంబర్కు**

వినియోగదారులు తమ ఫిర్యాదులను ప్రతి సోమవారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు సెక్షన్, సబ్ డివిజన్, డివిజన్,ఈ.ఆర్.ఓ కార్యాలయాల్లో నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమంలో నేరుగా వివరించవచ్చని తెలిపారు. కంపెనీ టోల్ ఫ్రీ నంబర్ 1912కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.రైతులకు, వినియోగదారులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు పోతే ఎవరూ స్వయంగా మార్చవద్దని, ఆ ప్రాంత ఓ&ఎం సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, తద్వారా ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. వ్యవసాయ బావుల వద్ద స్టార్టర్లకు ఇనుప డబ్బాలకు బదులు ప్లాస్టిక్ డబ్బాలను వాడాలని రైతులను కోరారు.ఇంటికి,వ్యవసాయ బావులకు,కొత్తగా కనెక్షన్ కావాల్సిన వారు నేరుగా 'మీ సేవ'లో దరఖాస్తు చేసుకుంటే మీటర్ బిగించి సర్వీసు ఇస్తామని తెలిపారు.రైతులు తమ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవడం ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ తగ్గి, అవి ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయని ,లోవోల్టేజీ సమస్యలు రావని తెలిపారు.ప్రతి ఒక్కరూ సకాలంలో కరెంటు బిల్లులు చెల్లించి, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు, సంస్థ అభివృద్ధికి సహకరించాలని డిఈ రవి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏడీఈ,డివిజన్ ఏఈలు, సబ్ ఇంజనీర్లు,ఓ&ఎం సిబ్బంది,అకౌంట్స్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ళమోసంపై సైబర్ క్రైమ్ సీఐ ఆరా

- బాధిత కుటుంబంతో మాట్లాడిన సముద్రాల జితేందర్
- విశాలభారతి కథనానికి స్పందన

**అశ్వాపురం, విశాలభారతి:** మండలంలోని మారుమూల ఏజెన్సీలో గల గొందిగూడెం గ్రామానికి చెందిన బత్తుల పద్మను గత నెల 28వ తేదీన ఓ వ్యక్తి ఆమె ఇంటికి వచ్చి కొన్ని వస్తువులను అంటగట్టి సైబర్ మోసానికి పాల్పడిన నేరగాళ్ల గురించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ సముద్రాల జితేందర్ శుక్రవారం బాధితులతో ఫోన్లో మాట్లాడారు. విశాల భారతిలో ఏజెన్సీలో సైబర్ మోసగాళ్ళ హల్చల్ అనే కథనానికి స్పందించిన ఆయన మోసపోయిన బాధితులతో మాట్లాడి మోసం జరిగిన తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు . అంతేకాకుండా మోసగాళ్ల ఫోన్ నెంబర్లు, బాధితులకు వారిచ్చిన స్కానర్ లను ఆయన వాట్సాప్ ద్వారా సేకరించుకున్నారు. విచారణ చేపట్టి సాధ్యమైన మేరకు న్యాయం జరిగేలా చూస్తామని బాయితులకు ఫోన్ ద్వారా ఆయన తెలిపారు. ఏజెన్సీ గ్రామాలలోని ప్రజలు ఎవరైనా వస్తు రూపంలో గానీ ధన రూపంలో గానీ మీకు సహాయం చేస్తామని, రుణాలు ఇప్పిస్తామని నమ్మ పలికితే ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దన్నారు. సైబర్ మోసగాళ్ల పట్ల మోసాలకు గురైన వారు నిరభ్యంతరంగా సైబర్ క్రైమ్ అధికారులకు తెలియజేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పరుగులు పెడుతున్న ఇటువంటి తరుణంలో మోసాలు జరిగే ప్రమాదం అధికంగా ఉందని ఫోన్ ద్వారా వచ్చే ఓటీపీలు గాని మోసగాళ్లు వాట్సాప్ లో పెట్టే లింకులను ఓపెన్ చేయొద్దని ఆయన తెలిపారు. ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా ఉండాలంటే అప్రమత్తతే ప్రధానమన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు గ్రామాల్లో సంచరించి సున్నితమైన మాటలు చెబితే వారి గురించి వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## తప్పిన ప్రమాదం

- అదుపుతప్పి ఇంటిపైకి దూసుకెళ్లిన స్విఫ్ట్ కారు
- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు, ఇల్లు ఖాళీగా ఉండటం వల్ల తప్పిన ప్రమాదం
- ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు



**అశ్వారావుపేట, విశాలభారతి:** అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం గ్రామంలో జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన ప్రమాదం స్థానికులను ఆందోళనకు గురి చేసింది. వేగంగా వస్తున్న స్విఫ్ట్ కారు అదుపు తప్పి రోడ్డుపక్కనున్న ఓ ఇంటిపైకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయినట్టు సమాచారం. అదృష్టవశాత్తూ ఘటన సమయంలో ఆ ఇల్లు ఖాళీగా ఉండడంతో ప్రాణనష్టం ఏమీ జరగలేదు. లేకపోతే పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాద స్థలిని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ఆదివాసులపై సవతి తల్లి ప్రేమ

- ఆదివాసీ ఉద్యమాలను చీల్చేందుకే రాజకీయ కుట్ర
- స్వతంత్రం లేని అభ్యర్థులుగా బరిలోకి
- ఎన్నికల్లో పెట్టుబడిదారుల దే హవా ఏజెన్సీ చట్టాలు గాలిలో దీపాలే
- ఆదివాసీ నేత కంగాల రమణకుమారి ఆవేదన



**భద్రాచలం, విశాలభారతి:** ఈనెల 11 జరిగే గ్రామపంచాయతీ ఎన్నికల్లో స్వతంత్రం లేని అభ్యర్థులే పోటీదారులుగా ఉంటున్నారని దాని వలన పెట్టుబడిదారులు ఏం చెప్పితే అది చేయాల్సినటువంటి దౌర్భాగ్యమైన పరిస్థితి వస్తుందని మహాజన సమితి ఆదివాసి మహిళ రాష్ట్ర కన్వీనర్ కంగాల రమణకుమారి ఆవేదన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భద్రాచలం పట్టణంలో ఇప్పటికే రాజకీయ సంక్షోభం ఉందని అది మరలా పునరావృతం అయ్యే ప్రమాదం పొంచి ఉందని ఆమె పేర్కొన్నారు ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు స్వతంత్రం లేని అభ్యర్థులు ఉన్నారని దానివలన భద్రాచలంలో నిరంకుశత్వ పాలన కొనసాగుద్దని ఆమె ఉద్ఘాటించారు ఎవరికి అందినంత వాళ్లు తినే ప్రక్రియగా ఈ ఎన్నికలు కొనసాగుతున్నాయని ఆమె ఎద్దేవా చేశారు అంబేద్కర్ ఆశించిన గ్రామ పరిపాలన సౌలభ్యం ఎక్కడ కొనసాగదని ఎవరికి వారు యమునా తీరు లా గ్రామపంచాయతీని పంచుకునే ఎన్నికల ప్రక్రియగా ఉందని రాబోయే ప్రమాదాన్ని ప్రజలు గమనించాలని ఆమె తెలిపారు వివిధ రాజకీయ నేతల కుటిల పన్నాగాన్ని ప్రజలు ఆదివాసి ప్రజలు తెలుసుకోకపోతే మోసపోతామని ఆమె వివరించారు బడా వ్యాపారస్తుల వ్యాపారాలకు లైన్ క్లియర్ అయ్యందుకే ఈ ఎన్నికల హడావుడి జరుగుతుందని ఆమె తెలిపారు సామాన్య ప్రజలకు ఏ ఒక్క ఉపయోగం లేదని వారి జీవన విధానం మారదని ఆమె తెలిపారు. సామాన్య ప్రజలు అర్థం చేసుకోవాలని ఆమె అన్నారు.

# వన్యప్రాణులను వేటాడిన మాజీ ఎమ్మెల్యే తనయుడు

- అర్బన్ పార్క్‌లో దుప్పల వేటకు రఘును ప్రధాన నిందితుడిగా ఎఫ్ఐఆర్ నమోదు
- రఘు వేటాడిన దుప్పల మాంసమే వివాహ విందుకు తరలించినట్టు అటవీశాఖ నిర్ధారణ
- ముందుగా అరెస్టైన ఇద్దరూ ఇదే వేట శ్రేణికి సహకరించిన కోణంలో వ్యవహరించారని అధికారులు స్పష్టం






**అశ్వరావుపేట,విశాలభారతి:**

అశ్వరావుపేట నియోజకవర్గం బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తనయుడు రఘు వివాహ విందులో దుప్పుల మాంసం వడ్డించిన ఘటనపై నెలకొన్న అనుమానాలకు చివరకు తెరలేచింది. వన్యప్రాణులను వేటాడిన ప్రధాన నిందితుడు రఘేనని దర్యాప్తులో తేలడంతో, సత్తుపల్లి అటవీశాఖ రఘును నిందితుడిగా పేర్కొంటూ అధికారికంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ మేరకు అర్బన్ పార్క్ దుప్పుల వేట ఘటనతో వివాహ విందు దుప్పుల మాంసం సరఫరా మధ్య సంబంధం స్పష్టమైంది. ప్రాథమిక విచారణలో ఐదు దుప్పులను తుపాకులతో కాల్చి హతమార్చినట్టు నిర్ధారణ కాగా, రఘు వాటిని వివాహ విందుకు తరలించి మాంసం వడ్డించిన విషయం వెలుగులోకి వచ్చింది. విస్తృతంగా ఆహ్వానాలు ఉన్న ఈ విందుకు వన్యప్రాణుల వేటతో మాంసం సేకరించినట్టు అటవీశాఖ నిర్ధారించడంతో, రఘుపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద పలు సెక్షన్లు అమలయ్యాయి. కనీసం 3-7 ఏళ్ల జైలు, వాహనాల స్వాధీనం, భారీ జరిమానాలు తప్పవని అధికారులు తెలిపారు. ఈ పరిణామానికి ముందు సత్తుపల్లి నీలాద్రి అర్బన్ పార్క్ పరిసరాల్లో జరిగిన దుప్పుల వేట కేసులో ప్రధాన నిందితుడు పరారీలో ఉండగా ప్రైవేట్ ఉద్యోగి గోపికృష్ణ, రాంప్రసాద్‌లను అదుపులోకి తీసుకోవడం, వారిని రిమాండ్‌కు పంపడం ప్రజల్లో అనుమానాలు రేకెత్తించింది. వేట జరిగిన రాత్రి 'వారాహి' స్టిక్కర్ ఉన్న వాహనం పార్క్‌లోకి ప్రవేశించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయినప్పటికీ, అప్పటివరకు ఆ వాహనం యజమానిని, అందులో ప్రయాణికులు ఎవరో వెల్లడించకపోవడంతో దర్యాప్తుపై విమర్శలు వినిపించాయి. అయితే తాజాగా రఘుపైనే కేసు నమోదు కావడం వల్ల ఈ ఇద్దరిని అరెస్టు చేయడం కూడా ఇదే వేట శ్రేణికి సంబంధించి, నేరానికి సహకరించిన కోణంలోనేనని అధికారులు స్పష్టంచేశారు. రెండు ఘటనలు పరస్పరం అనుసంధానమై ఉన్నాయని, అర్బన్ పార్క్‌లో వేట జరిగిన రాత్రి అక్కడి నుండి తీసుకువెళ్లిన దుప్పులే తదుపరి రోజున జరిగిన వివాహ విందులో ఉపయోగించబడ్డాయని అటవీశాఖ విచారణలో తేల్చింది. ఎఫ్ఐఆర్ నమోదు అయిన నేపథ్యంలో దర్యాప్తు గోప్యత, సీసీ కెమెరా ఫుటేజీ విడుదల ఆలస్యం, కీలక వ్యక్తుల వివరాల ప్రకటనలో వచ్చిన అపార్థాలు ప్రజల్లో కలిగించిన అనుమానాలు ఇప్పుడు తగ్గుముఖం పట్టాయి. అయితే వన్యప్రాణి సంరక్షణలో కీలక పాత్ర పోషించాల్సిన అటవీశాఖ ఇంత పెద్ద సంఘటనలో ప్రారంభ దశలలో స్పష్టత చూపకపోవడంపై పర్యావరణ ప్రేమికులు విమర్శలతో పాటు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.


POR Issued by P. Srinivasa Rao - forest Beat officer Sattupally
FORM - A
ORIGINAL
(See Rule 3 (1) of Andhra Pradesh Forest Offences (Compounding and Prosecution) Rules 1969)
Sattupally Division, Sattupally Range.
Book No. 13/20-21
Report No. 20
PRELIMINARY OFFENCE REPORT
1. Name, Parentage and Address of the accused person (s).
2. Nature of Offence
3. Place where Offence occured and place of Seizure
4. Date and time of detection of offence 29.11.2025 - 5.00 PM.
5. Name and address of complinant / detector
6. Description and value of forest produce involved in Forest Offence with measurements and Quantity.
7. Description of Vehicles, tools etc. used in committing of Forest Offence Smart Phones - 2 No's
8. Name and address of Witnesses.
Date 01-12-2025
Signature
Designation
Note :- The original to be sent to next immediate superior Officer within 24 hours, and duplicate is to be sent to Divisional Forest Officer, triplicate will be retained in the book.
(On the Reverse side of P.O.R. details of produce and property seized should be given Length, Girth, Cubical contents, species etc. and quantity in respect of other produce)

## డాక్టర్ల నిర్లక్ష్యంతో తల్లి గర్భంలోనే శిశువు మృతి

- వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో ఘటన



**ఎల్బీనగర్, విశాలభారతి:** నల్గొండ జిల్లా చిన్న సూరారం గ్రామానికి చెందిన సమీనా (25) ప్రసవం కోసం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. రెండు రోజుల పాటు నొప్పులు కొనసాగినప్పటికీ సరైన వైద్య జాగ్రత్తలు తీసుకోలేక, శిశువు మృతి చెందడం కుటుంబ సభ్యులను తీవ్రంగా కలచివేసింది. సమీనా భర్త హైమత్ అలీ (30), టిజిఎంజి (టీజీఎంజే )లో ఎస్.ఆర్.ఏగా పనిచేస్తున్నారు. 3వ తేదీ ఉదయం 10 గంటలకు సమీనా ఆసుపత్రికి చేరి అడ్మిట్ అయ్యారు. 3వ తేదీ రాత్రి నొప్పులు ప్రారంభమైనప్పటికీ, నైట్ డ్యూటీ లో స్టాఫ్ నర్సులు ఇంజెక్షన్ ఇవ్వడం మాత్రమే చేశారు. 4వ తేదీ నుంచి నొప్పులు తీవ్రంగా కొనసాగడంతో, మొదటి కాన్పు కావడం వల్ల వైద్యులు నార్మల్ డెలివరీ చేయాలని నిర్ణయించుకున్నారు. శుక్రవారం నాడు ఉదయం, నొప్పులు తీవ్రతరం కావడంతో గైనకాలజిస్ట్ డాక్టర్ కళ్యాణి, పర్యవేక్షణలో స్టాఫ్ నర్సులు సంధ్య, పూజిత, రుక్మిణి, ఆపరేషన్ థియేటర్ లో డెలివరీ చేసే ప్రయత్నం చేశారు. అయితే, శిశువు కడుపులోనే మృతి చెందినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కృష్ణ మాట్లాడుతూ.. ప్రథమ కాన్పు కావడంతో నార్మల్ డెలివరీ ప్రయత్నం జరిగింది. శిశువు కడుపులో మృతి చెందాడు."అని చెప్పాడు ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటాం."అని తెలిపారు. శిశువు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, వనస్థలిపురం ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. కుటుంబం వైద్యుల నిర్లక్ష్యం కారణంగా శిశువు మృతి చెందిందని ఆరోపిస్తూ, తగిన చర్యలకు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు

- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తెల్గమల్ల రవి



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నందివనపర్తి సర్పంచ్ బరిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తెల్గమల్ల రవి ఉండనున్నారు. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నేతలు,కార్యకర్తలు గ్రామంలో పెద్ద ఎత్తున హాజరై ర్యాలీ నిర్వహించారు. నందీశ్వరాలయం లో పూజ కార్యక్రమం నిర్వహించిన, అనంతరం కాంగ్రెస్ పార్టీ నేతలు బీఎన్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్ర శేఖర్ రెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్ మల్లా రెడ్డి తో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తెల్గమల్ల రవి సర్పంచ్ గా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. గ్రామానికి సేవ చేసే భాగ్యం కల్పించాలని గ్రామస్థులను కోరాడు. సర్పంచ్ గా ఒక్క అవకాశం ఇచ్చి గ్రామ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యాచారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, నేతలు మూడేడ్ల వెంకట్ రెడ్డి, జోగి రెడ్డి , గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నెర్ర శ్రీశైలం,మహ్మద్ షాహిద్, నెర్ర భాష , కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు , గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నందివనపర్తి గ్రామ అభివృద్దే ధ్యేయంగా పని చేద్దాం

- బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గోరటి వెంకటేష్



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** నందివనపర్తి గ్రామ అభివృద్దే ధ్యేయంగా పని చేద్దామని బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గోరటి వెంకటేష్ అన్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామం సర్పంచ్ గా గోరటి వెంకటేష్ శుక్రవారం నామినేషన్ ను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి దాఖలు చేశారు. ఈ నామినేషన్ కోసం పెద్ద ఎత్తున మహిళలు, పార్టీ కార్యకర్తలు , నాయకులు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోరటి వెంకటేష్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి పాటు పడి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే ముందున్న లక్ష్యం అన్నారు. ఒక్క అవకాశం ఇస్తే గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని, గ్రామానికి సేవ చేసే అవకాశం ఇవ్వాలని గ్రామస్థులను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వర్యవత్ రాజు నాయక్ , పార్టీ సీనియర్ నాయకులు ఐలాపురం నర్సి రెడ్డి, కంబాలపల్లి లక్ష్మి కాంత్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు ఒంగురీ రాజు, సీనియర్ నాయకులు యంజాల చంద్రకాంత్, గుండెమోని యాదయ్య, కొండాపురం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



**గండిపేట్, విశాలభారతి :** అయ్యప్ప స్వామి కరుణ కటాక్షాలతో ప్రజలంతా సుఖంగా ఉండాలని నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్ అన్నారు. బండ్లగూడ జాగీర్ గంధంగూడ గ్రామంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూపాల్ గురుస్వామి, నవీన్ గురుస్వామి, బాబు గురుస్వామి, అశోక్ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో రమేష్, రాజు, సాయి, శ్రీనివాస్, అంకం శ్రీనివాస్, అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అయ్యప్ప పూజలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్, విశాలభారతి:** రాజేంద్ర నగర్ నియోజక వర్గ పరిధిలోని మైలర్ దేవ్ డివిజన్ మైలార్ జూపల్లి ఓల్డ్ విలేజ్ లో యాదగిరి గురు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ గురు స్వామి అయ్యప్ప మహా పడి పూజ మరియు అన్న ప్రసాదం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొని స్వామి వారి ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. అయ్యప్ప స్వామి వేద మంత్రోచ్చరణలతో స్వామి వారి నామ సమరణతో అంగరంగ వైభవంగా మహా పడి పూజ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయ్యప్పస్వామి చల్లని ఆశీస్సులు దీవెనలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో పడి పంటలతో జీవితాంతం ఆనందంగా ఉండాలని ఆయన ఆకాంక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్, గురుస్వాములు యాదగిరి గురుస్వామి, రాజు గురుస్వామి, గురు స్వామి గణేశ్ ముదిరాజ్, శ్రవణ్ స్వామి, లాలూ స్వామి, వెంకట్ స్వామి, రావుల భాస్కర్, బబ్లూ, మణికంఠ స్వామి, వెంకట్, ఎన్ను శంకర్ రెడ్డి, అభిలాష్, ప్రణయ్, లడ్డు, రాకేష్, విశాల్, డివిజన్ పరిధిలోని సన్నిధానం స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌ని ముఖ్యమంత్రి చేయడమే మన ధ్యేయం

- బీఆర్ఎస్ పార్టీ నుండి పోటీ చేసే అభ్యర్థులందరూ గెలుపే లక్ష్యంగా ధైర్యంగా ముందుకు సాగాలి
- కార్యకర్తలు అందరూ రాత్రింబవళ్లు సైనికుల్లా పనిచేయాలి



**పాల్వంచ, విశాలభారతి:** కేసీఆర్‌ని ముఖ్యమంత్రిని చేయడమే మనందరి ధ్యేయమని టిఆర్ఎస్ అభ్యర్థులు కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలనీ మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. పాల్వంచ మండలంలో రెండో విడత జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్నటువంటి సర్పంచులు వార్డు నెంబర్లు అందరూ శుక్రవారం, టిఆర్ఎస్ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గ ఇంచార్జి మాజీ మంత్రివర్యులు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వనమా వెంకటేశ్వరరావుని వారి స్వగృహం నందు కలిసి వారి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ వారి గెలుపు కోసం కార్యకర్తలందరూ రాత్రింబవళ్లు సైనికుల వల్లే పనిచేసి పార్టీ బలపరుస్తున్నటువంటి సర్పంచులను వార్డు నెంబర్లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు నాయకులకు దశ దిశ నిర్దేశంచేసి పలు సూచనలు చేసినారు.అతి త్వరలోనే నేను మీ అన్ని గ్రామాలు తిరిగి మీ గెలుపుకై ప్రచారం చేస్తానని మీకు అండదండగా ఉంటానని వారిలో ధైర్యాన్ని నింపారు. భవిష్యత్తులో మనందరం కలిసి కెసిఆర్ గారిని ముఖ్యమంత్రి చేయడమే మన ధ్యేయమని ఈ సందర్భంగా తెలియజేసినారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ మండల పట్టణ ముఖ్య నాయకులు పోటీ చేసే అభ్యర్థులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లష్కర్ గూడ బీఆర్ఎస్ అభ్యర్థిగా సిన సాయికుమార్ నామినేషన్




**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్మెట్ మండలం లష్కర్ గూడ గ్రామ పంచాయతీలో బీఆర్ఎస్ పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థిగా సిన సాయికుమార్ శుక్రవారం నాడు నామినేషన్ దాఖలు చేశారు. గ్రామంలో ఉన్న ఎనిమిది వార్డుల నుంచి వార్డు సభ్యులూ తమ నామినేషన్లు వేయడం జరిగింది.ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ——తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్నా, ప్రజలకు ఇస్తామని చెప్పిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా మభ్యపెడుతుందని, రాష్ట్రంలో దుర్మార్గపు రాచరిక పాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజలపై జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొనాలంటే బీఆర్ఎస్‌ను బలపడాలని, తాను సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తోన్న ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామస్థులను కోరారు.గ్రామ అభివృద్ధి, ప్రజలకు ఇచ్చిన హామీల నెరవేర్పు బీఆర్ఎస్ ప్రభుత్వం ద్వారానే సాధ్యమని సాయికుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మోసానికి బలి అయినా ఈశ్వర చారి

- బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి



**ముషీరాబాద్, విశాలభారతి:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మాట ఇచ్చి కాంగ్రెస్ పార్టీ చేసిన మోసానికి ఈశ్వర చారి ఆత్మహత్య చేసుకున్నాడని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలు తీసుకోకపోవడం వల్లనే ఆనాడు తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంతాచారి అమరుడైతే.. నేడు బిసి ఉద్యమంలో సాయి ఈశ్వర్ చారి అగ్నికి ఆహుతి అయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆత్మహత్యకు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలే కారణమని పేర్కొన్నారు. శుక్రవారం గాంధీ ఆసుపత్రి వద్ద జరిగిన బీసీ సంఘాల నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.మృతి చెందిన సాయి ఈశ్వర్ చారి కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు.ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలే ఈ హత్యకు బాధ్యత వహించాలన్నారు. సాయి ఈశ్వర్ మృతి తో అయినా కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు దిగి రావాలని డిమాండ్ చేశారు. మృతి పై పార్లమెంట్లో చర్చ జరగాలని,బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ఆమోదించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సర్పంచ్ ఎన్నికలు నిలిపి వేసి రిజర్వేషన్లు తర్వాతనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.బీసీ ద్రోహుల పార్టీలైన కాంగ్రెస్, బిజెపిల నాయకుల ఇండ్లను ముట్టడిస్తామని ఆ పార్టీలో ఉన్న బీసీ నేతలు తమ పదవులకు రాజీనామా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ బీసీ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చెలరేగిన అంతర్గత పోరు



- గ్రామపంచాయతీ ఎన్నికలపై రాజకీయ వేడి
- గ్రామపంచాయతీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో రెబల్ కలకలం
- రాష్ట్ర నాయకుడిపై వెన్నుపోటు ఆరోపణలతో ఉద్రిక్తత
- పార్టీ నిర్ణయానికి విరుద్ధంగా నడిచినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**సత్తుపల్లి, విశాలభారతి:** సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో ఈరోజు పార్టీ సీనియర్ నాయకులు అత్యవసరంగా ప్రెస్ మీట్ నిర్వహించారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారికంగా పోటీ చేసే అభ్యర్థుల జాబితాను పార్టీ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఒక సీనియర్ రాష్ట్ర స్థాయి పదవి అనుభవిస్తున్న నాయకుడిపై "పార్టీకి వెన్నుపోటు" చేశారనే ఆరోపణలు రావడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ అంతర్గతంగా బగ్గుమన్న విభేదాలు బయటపడుతున్నాయి. పార్టీ నేతలు మాట్లాడుతూ.. పార్టీలో ఉండి. పార్టీకి బలహీనత కలిగించే ప్రయత్నాలు చేయడం అసహ్యం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం రాష్ట్ర స్థాయి పదవిలో ఉన్న ఒక నాయకుడు, అధికారిక అభ్యర్థుల జాబితా విడుదలకు ముందే రెబల్ అభ్యర్థులను ప్రోత్సహిస్తున్నాడనే ఆరోపణలు వెలువడ్డాయి.

ప్రెస్ మీట్‌లో నాయకులు మండిపడుతూ.. ఇప్పుడున్న రాష్ట్ర పదవికి తగిన నిబద్ధత చూపకపోతే... రాబోయే కాలంలో ఆ నాయకుడు కింద స్థాయి పదవికైనా పనికిరాని పరిస్థితి వస్తుంది. పార్టీకి ద్రోహం చేసే వారికి కాంగ్రెస్‌లో స్థానం లేదు" అని స్పష్టం చేశారు. గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే, కొంతమంది అసంతృప్త నేతలు స్వతంత్రులుగా బరిలోకి దిగుతున్నట్టు సమాచారం. వీరికి పై పేర్కొన్న నాయకుడే మద్దతు ఇస్తున్నాడనే ఆరోపణలే ఇప్పుడు రాజకీయ వేడి పెరగడానికి కారణమవుతున్నాయి. ఓటు విభజనకు దారితీసే ఈ రెబల్ అభ్యర్థుల పరిస్థితి పార్టీకి ఆందోళన కలిగిస్తోంది. ప్రెస్ మీట్ ముగింపులో నాయకులు హెచ్చరిస్తూ.. సత్తుపల్లి కాంగ్రెస్ బలమైన కేడర్ ఉన్న నియోజకవర్గం. వ్యక్తిగత ఆశలు కాదు, పార్టీ నిర్ణయం ముఖ్యం. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా వెళ్లేవారిపై కఠిన చర్యలు తప్పవు" అని స్పష్టం చేశారు.

## మానేకి దళిత సంఘాల జేఏసీ మద్దతు



- ఎస్సీ కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణకు హామీ
- బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ఏర్పాటుకు హామీ
- పట్టణ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తానని భరోసా

**భద్రాచలం , విశాలభారతి:** భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీకి ఈనెల 11 వ తారీకున జరగబోయే స్థానికల బరిలో టిఆర్ఎస్ సీపీఐఎం గుండ్వానా దండకారణ్య పార్టీ ఆదివాసి జేఏసీ బలపరిచిన అభ్యర్థికి దళిత జేఏసీ కూడా సంపూర్ణ మద్దతును ప్రకటించడం జరిగింది ఈ సందర్భంగా దళిత జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ కమిటీ హాల్ పూర్తి కాకుండా అసంపూర్ణంగా ఉండటం వలన ఎస్సీ సామాజిక వర్గం పెళ్లిళ్లు కానీ ఇతరత్రా ఫంక్షన్లు గాని చేసుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నామని బయట ఫంక్షన్ హాల్ లో చేసుకునే స్తోమత లేనందున అనేక ఇబ్బందులు పడవలసి వస్తుందని ఈ విషయంపై భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికల బరిలో బిఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి మానే రామకృష్ణకు కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ పై చర్చించడం జరిగిందని మానే రామకృష్ణ సర్పంచిగా గెలుపొందిన తక్షణమే ఎస్సీ కమ్యూనిటీ హాల్ పున్నర్ నిర్మాణం చేస్తానని హామీ ఇవ్వడం వలన దళిత జేఏసీ నాయకత్వం మానే రామకృష్ణకు సంపూర్ణ మద్దతును ప్రకటించడం జరిగిందని వారు పేర్కొన్నారు అంతేకాకుండా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు కూడా చేస్తానని హామీ ఇచ్చారని వారన్నారు పట్టణ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని కాలనీలలో మౌలిక వసతుల కల్పన కోసం నిరంతరం పనిచేస్తానని ఆయన తెలిపారని వారన్నారు అందుకే సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్న మానే రామకృష్ణకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని వారన్నారు ఎస్సీ కాలనీలలో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆ కాలనీలో అభివృద్ధి కోసం నిరంతరం శక్తి వంచన లేకుండా పనిచేస్తానని ఆయన తెలిపారనీ వారన్నారు అందుకే దళిత జేఏసీ పట్టణ ప్రజలకు మానే రామకృష్ణ ప్రజల మనిషిని వారు పేర్కొన్నారు మానే రామకృష్ణ ఎన్నికల గుర్తు లేడి బ్యాగ్ అని ఐదవ బ్యాలెట్ లో ఉన్న గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి పట్టణ అభివృద్ధి కోసం పట్టణ ప్రజలు తమ ఓటును వినియోగించుకోవాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో దళిత జేఏసీ నాయకులు అల్లాడి పోల్ రాజ్ గద్దం సుధాకర్ రావు ముద్దా పిచ్చయ్య గురజాల వెంకటేశ్వర్లు ఏవి రావు కోగిల గాంధీ గుండె సుహాసిని దామల్ల సత్యం బుయ్యన వీరబాబు పూస శ్రీను కోట దిలీప్ చీర గడ్డ శేఖర్ తోకల దుర్గాప్రసాద్ తదితరులు ప్రెస్మీట్లో పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

# తెలంగాణ అభివృద్ధిలో గ్లోబల్ సమిట్ కీలకం

**విశాలభారతి, నేషనల్:**

తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కీలక భూమిక పోషిస్తుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలంటూ సోనియాగాంధీ సందేశం పంపించారు. ఈ నెల 8, 9 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర పురోగతికి దోహదపడటానికి చేస్తున్న అన్ని ప్రయత్నాల్లో విజయం సాధించాలని ఆమె ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నందుకు ముఖ్యమంత్రి గారికి అభినందనలు తెలిపారు. సదస్సు విజయవంతం కావాలన్న ఆకాంక్షను సోనియాగాంధీ వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక, ప్రాముఖ్యమైన ప్రాజెక్టులు, ప్రణాళికల్లో భాగస్వాములు కావాలసిన వారికి ఈ సదస్సు ఒక వేదికగా దోహదపడుతుందని సోనియా గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సందేశం పంపించారు. అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ-వ్యవసాయాభివృద్ధి ప్రాజెక్టులకు సమ ప్రాధాన్యం ఇస్తూ మూడంచెల వ్యూహంతో తెలంగాణ ముందుకు సాగుతోందని ఆ లేఖలో ప్రస్తావించారు. తెలంగాణలోని మానవ వనరులు, సహజ వనరులు, ప్రజల వ్యాపార నైపుణ్యం, అంతర్జాతీయ



ప్రతిభ, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి సదస్సు మరింత తోడ్పడుతుందని అన్నారు. సదస్సులో పాల్గొంటున్న వారందరికీ సోనియా గాంధీ శుభాభినందనలు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2047'కు రంగం సిద్ధమైంది. ఈ నెల 8, 9 తేదీల్లో జరగనున్న ఈ సదస్సు ప్రపంచ స్థాయి దిగ్గజాలకు ఆతిథ్యం ఇవ్వనుంది. 'తెలంగాణ రైజింగ్ థీమ్' తో రాష్ట్రం ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. ప్రముఖ పరిశ్రమల అధినేతలు, ఇన్నోవేటర్లు, పాలసీ మేకర్లు, సినీ, క్రీడా, విద్యా రంగాలకు చెందిన ప్రముఖులు, విదేశీ రాయబారులు, వివిధ రంగాల నిపుణులను ప్రభుత్వం ఒకే వేదికపైకి తీసుకురానుంది. ఈ సదస్సు తెలంగాణ భవిష్యత్ రూపకల్పనకు కీలకం కానుంది.

సదస్సులో పాల్గొనాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం సుమారు 4,800 మంది ప్రముఖులకు ఆహ్వానాలు పంపింది. ఇప్పటికే సుమారు 600 మందికి పైగా జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు తమ సంసిద్ధతను వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు రోజుల కార్యక్రమంలో 2 వేల మందికి పైగా అతిథులు హాజరవుతారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి దాదాపు రూ. లక్ష కోట్లకు పైగా పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు జరిగే అవకాశముందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఒప్పందాలు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి కొత్త ఊపునిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సదస్సు ప్రధాన లక్ష్యం - 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వృద్ధిని 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడం. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలపై విస్తృత చర్చాగోష్ఠులు నిర్వహించనున్నారు. పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల నిష్ణాతులు ఈ చర్చల్లో పాల్గొని తమ సూచనలు, అనుభవాలు పంచుకుంటారు. ఈ ప్రణాళికల రూపకల్పన రాష్ట్ర భవిష్యత్ ప్రగతికి దిశానిర్దేశం చేస్తుంది. ఈ సదస్సులో పలు కీలక అంశాలపై నిపుణులు చర్చించనున్నారు. ముఖ్యంగా కాలుష్య రహితం (నెట్ జీరో) సాధించడం, సెమీ కండక్టర్ల పరిశ్రమ అభివృద్ధి, కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సామర్థ్యం, నైపుణ్యంతో కూడిన మానవ వనరుల అభివృద్ధి, మహిళల ఆర్థికాభివృద్ధి, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల వృద్ధి, క్రీడాభివృద్ధి లాంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారిస్తారు. ఈ రంగాల నిపుణులు తమ అభిప్రాయాలను, విధానాలను తెలియజేస్తారు. వారి అనుభవం రాష్ట్ర ప్రణాళికలకు బలం చేకూరుస్తుంది.

జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్న నేపథ్యంలో.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. అతిథులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు పాటిస్తున్నారు. బస, రవాణా, ఇతర లాజిస్టికల్ ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతిష్టాత్మక సదస్సు విజయవంతం చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోంది. ఈ సమిట్ ద్వారా తెలంగాణ ప్రపంచ పటంలో తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకునే అవకాశం ఉంది.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలి



**పర్వతగిరి, విశాలభారతి:** పర్వతగిరి మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కోసం జిల్లా, మండల నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులతో కలిసి ప్రచారంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్. అభ్యర్థుల గెలుపు కోసం గడప గడపకు కాంగ్రెస్ పార్టీ నినాదంతో దూసుకెళ్తున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్. కార్యకర్తలలో ఉత్సహం నింపుతూ కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రచారంలో దూసుకుపోతున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్. శుక్రవారం మండలం,పర్వతగిరి,ధౌలత్ నగర్, ఇస్లావత్ తండా, గోరు గుట్ట తండా, చింత నెక్కొండ, ఏనుగల్లు, మాల్యా తండా, చౌటపల్లి,గుగులోత్ తండా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందే విధంగా మనందరి అభిమాన నాయకుడు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సారథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి అర్హునికి సంక్షేమ పథకాలు అందించటమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని శ్రీనివాస్ నాయక్ తెలిపారు. గతంలో పరిపాలించిన నాయకులు ఈ ప్రాంత అభివృద్ధి కోసం , ఈ ప్రాంత బడుగు బలహీన వర్గాలను ఏమాత్రం పట్టించుకోలేదని కేవలం వారి స్వార్థం కోసమే ఫామ్‌హౌస్లు వారి బంధువులకు కావలసిన సౌకర్యాలు కల్పించుకోవడానికే తప్ప బడుగు బలహీన వర్గాలకు ఏనాడు పట్టించుకోలేదని శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ప్రజా ప్రభుత్వ ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలో బూత్ కు 12 ఇందిరమ్మ ఇల్లు చొప్పున మంజూరు చేసి, ప్రతి అర్హునికి తెల్ల రేషన్ కార్డు మంజూరు చేసి సన్నబియమిస్తూ, మా రైతు సోదరులకు రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, పంటలకు బోనస్ అనేక రకాలుగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని శ్రీనివాస్ నాయుడు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడ్డ అతి తక్కువ కాలంలోనే చదువుకున్న యువతి, యువకులకు ఎన్నో ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రజా ప్రభుత్వం ముందు ఉన్నదని, ఈ ప్రజా ప్రభుత్వాన్ని ఈ ప్రాంత ప్రజలు ఆశీర్వదించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తారని, గెలిపే దిశగా కాంగ్రెస్ పార్టీ సైనికులు, నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు సర్పంచ్లను, వార్డ్ నెంబర్లను గెలిపించే బాధ్యత తీసుకొని పనిచేయాలని శ్రీనివాస్ నాయక్ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు మాట్లాడుతూ, 33 గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచులు, వార్డ్ మెంబర్లు, వివిధ హోధలో పనిచేస్తున్న నాయకులు, మహిళా అధ్యక్షురాలు సువార్త, బిసి సెల్ నాయకులు మండల్ అధ్యక్షులు బంధేల వెంకన్న, జడ్పీ మాజీ కోఆప్షన్ ఎండి సర్వర్, పర్వతగిరి టౌన్ అధ్యక్షుడు కుసం రామచందర్, మండల సీనియర్ నాయకులు రతన్ రావు, చలపతిరావు, విడుదల కృష్ణ, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్, మాజీ ఎంపిటిసి మహేంద్ర, వీరితోపాటు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని ప్రచారన్ని విజయవంతం చేశారు.

## సైనికులకు ఎన్ని విరాళాలు ఇచ్చినా తక్కువే

**హనుమకొండ, విశాలభారతి:** శత్రు దేశాల నుంచి మన దేశాన్ని రక్షిస్తున్న సైనికులకు ఎంత విరాళాలు ఇచ్చినా తక్కువేనని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సాయిధ దళాల పతాక దినోత్సవం 2025 వేడుకల సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ లో హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ ను ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి సత్య శ్రీ, కార్యాలయ ఉద్యోగులు, ఎన్ సీ సీ కెడెట్లు కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణకు అంకితమైన సైనికుల కుటుంబాల సహాయానికి ఈ సారి ఎక్కువ మొత్తంలో విరాళాలు సేకరించి సహకరించాలన్నారు. అనంతరం ఎన్ సి సీ కేడేట్లు ఐదు బృందాలుగా విడిపోయి పట్టణంలోని ప్రధాన కూడళ్లు, జన సందోహ మార్గాల్లో వ్యాపార సంస్థలలో దుకాణాలలో ప్రయాణికుల వద్ద విరివిగా స్టిక్కర్లను అతికించి విరాళాలు సేకరించారు.

## పోరాట ఉద్యమ కెరటం మల్లు వెంకట నరసింహారెడ్డి



**సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ముత్యాలు**

**కోదాడ, విశాలభారతి:** తెలంగాణలో నిజాం రాచరిక పాలన,సాంఘిక,ఆర్థిక, దోపిడీపై తిరుగుబాటు పోరాటంలో ఉద్భవించిన నాయకుడు కామ్రేడ్ మల్లు వెంకట నరసింహారెడ్డి అనిసిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం ముత్యాలు అన్నారు. స్థానిక కోదాడ పట్టణంలో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ మల్లు వెంకట్ నరసింహ రెడ్డి గారి 21వ వర్ధంతి సందర్భంగా వారి ఫోటోకు పూలమాల వేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ (వి.ఎన్) పువ్వు పుట్టగానే పరిమళించు అన్నట్లు అన్యాయాన్ని ఎదిరించేతత్వం,అరాచకాలను ఎదుర్కొనే లక్షణంతో ఎత్తుగడల్లో దిట్టగా,తెలివిగల విద్యార్థిగా బాల్యం నుండే పోరాట మార్గాన్ని ఎంచుకున్నాడు. విద్యార్థి దశలో విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడై విప్లవోద్యమంలో తనదైన పాత్ర పోషించాడు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యునిగా,ఉద్యమాల రూపశిల్పిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మార్క్సిస్టు పార్టీ నిర్మాణంలోను తనదైన ముద్రవేశాడు. ప్రజాపోరాటాలు నిర్వహించడంతో పాటు సిద్ధాంత ఆచరణను మేళవిస్తూ మార్క్సిస్టు మహోద్యమంలో మహానేతగా కొనసాగాడు. పీడిత ప్రజల కోసం అహర్నిశలు పాటుపడిన కామ్రేడ్ వీఎన్ అనారోగ్యంతో 2004 డిసెంబర్ 5న అనారోగ్యంతో మరణించారు.నేడు ఆయన 21వ వర్ధంతి. పురిటిగడ్డ అయిన ఉమ్మడి నల్లగొండ జిల్లా తుంగతుర్తి ప్రాంతంలో మామిండ్లమడవ గ్రామంలో 19 మే 1930లో ధనిక రైతు కుటుంబంలో జన్మించిన వెంకట నరసింహారెడ్డి పేద ప్రజల కోసం జీవితాంతం పోరుబాటలో నడిచిన గొప్పయోధుడు. ఆయన ప్రజాప్రతినిధిగానూ సేవలందించారు. నల్లగొండ జిల్లాను సమగ్ర అభివృద్ధికి సాగు, తాగునీరు అందించాలని, ఫ్లోరైడ్ నివారణ కోసం కృషిచేశారు. ఆయనతో పాటు సతీమణి స్వరాజ్యం కూడా ముందు నడిచారు.ఆయన చరిత్ర విప్లవోద్యమాలకు వెలుగు. ఆయన పరిపూర్ణమైన విప్లవ జీవితం గడిపారు.ధనిక రైతు కుటుంబంలో పుట్టి పీడిత వర్గాల కోసం తుది శ్వాస వరకు పనిచేశారు. పేదల కోసమే గళమెత్తిన ఆయన గొప్ప ఆదర్శ కమ్యూనిస్టు. ఆయన నిరాడంబరత,సిద్ధాంత ఆచరణ నేటి తరానికి ఆదర్శం అని వారన్నారు ఈ యొక్క కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు దాసరి శ్రీనివాస్, ఎం రామారావు, కే వెంకటేశ్వర్లు, జి సైదులు, జి ఉపేందర్ జి రాములు జి సురేష్ రాంబాబు వెంకన్న నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అధికారులను తక్షణమే డిస్మిస్ చేయాలి

- **అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలను మూసివేయాలి**
- **యూఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్ నాయక్**



**హనుమకొండ, విశాలభారతి:** అవినీతి అధికారులను తక్షణమే డిస్మిస్ చేయాలని యూఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్ నాయక్ అన్నారు. హనుమకొండ ఇన్చార్జి డీఈవో వెంకట్ రెడ్డి, విద్యాశాఖ సెక్షన్ అధికారులైన గౌస్, మనోజ్ లు లంచం తీసుకుండగా వారిని ఏసీబీ అధికారులు పట్టుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టర్ కార్యాలయం ముందు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలోని అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలను మూసివేయాలని డిమాండ్ చేశారు. పలువురు అధికారుల అవినీతి వల్లనే ప్రయివేట్ యజమాన్యాలు అనుమతులేకుండా, ప్రభుత్వం నిబంధనలు పట్టించుకోకుండా విద్యాసంస్థలు నడుపుతున్నారని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయి విచారణ జరిపాలని విజ్ఞప్తి చేశారు. విద్యాశాఖలో లంచాలు తీసుకుంటున్న అధికారులను పూర్తిస్థాయిలో గుర్తించి వారిని తక్షణమే విధులను తొలగించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు, ఇతర సిబ్బందికి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జీతాలు ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. యూ ఎస్ ఎఫ్ ఐ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రేపే బిజెపి మహాధర్నా

- **భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలి**
- **బిజెపి సీనియర్ నాయకులు అంబాల రాజేశ్వరరావు**



**ముషీరాబాద్, విశాలభారతి:** రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఏ ఒక్క హామీ కూడా నెరవేరలేదని బిజెపి సీనియర్ నాయకులు అంబాల రాజేశ్వరరావు విమర్శించారు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా రాష్ట్రం తయారైందని పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్ బాగాలేదు.. అప్పులు తెచ్చే పరిస్థితి లేదని ముఖ్యమంత్రి మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. శుక్రవారం అంబాల రాజేశ్వరరావు తన కార్యాలయం నుండి పత్రిక ప్రకటన విడుదల చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను మార్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వంచన పాలనను నిరసిస్తూ పెండింగ్లో ఉన్న హామీల అమలు కోసం డిసెంబర్ 7న ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో బిజెపి మహా ధర్నా చేపట్టిందన్నారు. ఈ ధర్నాకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు ధర్నాలో పాల్గొంటున్నందున ప్రజలు బిజెపి నాయకులు శ్రేణులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## ఎల్లమ్మ గూడెం బాధితులను పరామర్శ

- **సాయి ఈశ్వర్ ఫ్యామిలీకి కోటి రూపాయలఎక్స్గ్రేషియా ఇవ్వాలి**
- **చాకలి ఐలమ్మ సంఘం ఫౌండర్ చైర్మన్ ఐదారి శంకర్**



**నల్లగొండ, విశాలభారతి:** నల్గొండ జిల్లా ఎల్లమ్మ గూడెంలో జరిగిన సంఘటనకు సంబంధించి తెలంగాణ బీసీ జనసభ పిలుపు మేరకు రాజారాం యాదవ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చాకలి ఐలమ్మ సంఘం ఫౌండర్ చైర్మన్ నాగిళ్ళ శంకర్ పాల్గొని సర్పంచ్ గా నామినేషన్ వేసినటువంటి అభ్యర్థి కి ఎన్నికల కమిషన్,నాగలక్ష్మి యాదగిరికి అభ్యర్థి ప్రచారానికి ప్రభుత్వం తక్షణమే రక్షణ కల్పియాలని,కిడ్నాప్ చేసి మూత్రం తాపించినటువంటి వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ సర్పంచి అభ్యర్థి ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా బీసీలపై చిన్న చూపు చూస్తున్న ఏదైతే కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీ కామారెడ్డి డిక్లరేషన్ లో చెప్పిన ప్రకారం రిజర్వేషన్ అమలు చేయడంలో పూర్తిగా ఈ ప్రభుత్వం విఫలమైంది, 42శాతం రిజర్వేషన్లపై పెద్ద ఎత్తున ఉద్యమాలు జరుగుతుంటే ఒకపక్క బీసీలపై అగ్రవర్ణాల దాడులు మాత్రం ఆగట్లేదు. మరి ఎల్లమ్మ గూడెంలో జరిగినటువంటి ఘటన చాలా బాధాకరం కేంద్ర ప్రభుత్వం అనుకుంటే 42శాతం రిజర్వేషన్ అనేది కష్టమేమీ కాదు. అదేవిధంగా తీన్మార్ మల్లన్న ఆఫీస్ ముందట బీసీ రిజర్వేషన్ల సాధనకై సాయి ఈశ్వర్ అనే యువకుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకొని చనిపోవడం బాధాకరం అన్నారు. ప్రభుత్వం వెంటనే సాయిశ్వర్ కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమనికి మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ చైర్మన్ దూదిమట్ల బాలరాజు యాదవ్, యాదవ సంఘాలు,బీసీ సంఘాలు పెద్ద ఎత్తునపాల్గొన్నారు.

## ప్రజలారా ఎన్నికల్లో డబ్బుల పంపిణీ ఆపగలిగేది మీరే

- **ఈ సంస్కృతిని అంతం చేయాల్సిన ప్రజలే**
- **పోటీ చేసేవారు కూడా అడ్డగోలు హామీలు ఇచ్చి ఆగం కాకండి**
- **ఈటల రాజేందర్ ఎంపీ**



**హైదరాబాద్, విశాలభారతి:** ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంట్, అసంబ్లీతో పాటు గ్రామ సచివాలయాలు, మండల జిల్లా పరిషత్ లు సమర్థవంతంగా పనిచేస్తేనే సమగ్రాభివృద్ధి జరుగుతుంది. గ్రామాల్లో ఉండే సమస్యలపై సర్పంచ్ కి ఉన్న అవగాహన ఎంపీపీ, జడ్పిటిసి, ఎమ్మెల్యే, ఎంపీలకు ఉండదు.

అందుకే గ్రామ సచివాలయాలు ఎంత గొప్పగా పనిచేస్తే ప్రజల సమస్యలు అంత గొప్పగా పరిష్కారం అవుతాయి. కానీ వాటికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారు. కేంద్రం ఇచ్చే పర్ కాపిటా, ఫైనాన్స్ కమిషన్, ఉపాధిహామీ నిధులతో మాత్రమే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుంది. గత సర్పంచ్ లు చేసిన పనులకు బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించక పోవడం వల్ల అనేకమంది సర్పంచ్ లు అప్పుల పాలయ్యి ఆత్మహత్యలు చేసుకున్నారు.

భార్యలా పుస్తెలు అమ్మి, ఉన్న ఆస్తులు అమ్మి పనులు చేసినం అయినా బిల్లులు చెల్లించలేదని ఏడుస్తున్నారు. కమీషన్లు ఇచ్చుకోలేక, ఆఫీసులు చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి అయ్యింది. ఈ రెండేళ్లలో బిల్లులు చెల్లించలేని, పనులు చేయలేని మంత్రులు ఇప్పుడు వచ్చి సర్పంచ్ లను గెలిపించండి ఈ మూడేళ్లు పనులు చేస్తామని చెప్తున్నారు.. వీళ్ల మాటలు ఎవరు నమ్మాలి? వారి మీద నమ్మకం లేదు. గ్రామపంచాయితీలను అత్యంత నిర్వీర్యం చేసింది బీఆర్ఎస్. బిల్లులు పెండింగ్ పెట్టింది వాళ్లే ఇప్పుడు వచ్చి మళ్లీ ఓట్లు అడుగుతున్నారు. వారు అక్కడ ఇక్కడ అధికారంలో లేరు.. వారిది కత్తి కాదు నెత్తి కాదు. వారు గెలిచి చేసేది కూడా ఏమీ లేదు. గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుంది అంటే అది కేవలం కేంద్రప్రభుత్వం నిధులతోనే జరుగుతుంది. గ్రామాల్లో పెరిగే చెట్లు, పారే మురుగు కాలువలు, వేసే సిమెంట్ రోడ్లు, కడుతున్న గ్రామపంచాయితీ, అంగన్వాడీ భవనాలు, కట్టిన రైతువేదికలు, స్మశానవాటికలు, తడిచెత్త పొడిచెత్త షెడ్లు, చౌరస్తాలో పెట్టిన హైమాక్స్ లైట్లు అన్నీ కేంద్రప్రభుత్వ నిధులతో పెట్టినవే. అందుకే ప్రజలు గమనించమని కోరుతున్న. ఈ రెండు పార్టీలకు ఓటు వేస్తే ఒరిగేది ఏమీలేదు. మీ మధ్యలో ఉండి, మీ సమస్యలు అర్థం చేసుకొని పరిష్కరించే వారిని ఎన్నుకోండి. ఎమ్మార్వో ఆఫీస్, ఎంపీడీఓ ఆఫీస్, పోలీస్ స్టేషన్ పనులు, వ్యక్తిగత సమస్యలు తీర్చేవారు కావాలి తప్ప ఎక్కడో ఉండి చుట్టం చూపుగా వచ్చేవారిని ఎన్నుకోకండి అని తెలిపారు.

## బందోబస్త్ పై రివ్యూ

- **ఏర్పాట్లను పరిశీలించిన దగ్గరుండి పరిశీలించిన డీజీపీ శివధర్ రెడ్డి**



**రంగారెడ్డి, విశాలభారతి:** జిల్లా కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, బందోబస్త్ మీద వివిధ డిపార్ట్మెంట్ అధికారులతో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. డీజీపీ శివధర్ రెడ్డి అడిషనల్ డీజీపీలు మహేష్ భగవత్, డీఎస్ చౌహాన్, ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ మాన్, టీజీ ఐఐసి ఎండీ శశాంక్, ఐజి రమేష్ రెడ్డిలతో కలిసి రివ్యూ నిర్వహించారు. అనంతరం శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్ కు అన్ని రకాల ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనికి సుమారు 3 వేల మంది జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు రానున్నారు. ఈ డెలిగేట్లకు 8, 9 తేదీల్లో మాత్రమే అనుమతి ఉంటుందని గుర్తు చేశారు. ఆ తర్వాత నాలుగు రోజులు మాత్రం కామన్ పబ్లిక్ కి అనుమతి ఉంటుందని అన్నారు. లా అండ్ ఆర్డర్ కి సంబంధించిన స్టాల్స్ ఏర్పాట్లను దగ్గరుండి చూసుకున్నాం. వీఐపీ ప్రతినిధుల చుట్టూ మూడంచెల భద్రత ఉంటుంది. గ్లోబల్ సమ్మిట్ జరిగే ప్రాంతంలో అడుగడుగునా నిఘా పెట్టేందుకు సుమారు వెయ్యికిపైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇవన్నీ సెంట్రల్ పోలీసు కంట్రోల్ రూమ్కు అనుసంధానమై ఉంటాయి. రేపు సాయంత్రం లోపు అన్ని ఏర్పాట్లు పూర్తవుతాయనీ ఆయన అన్నారు. బందోబస్త్ విషయంలో ఏ మాత్రం పొరపాటు చేయవద్దని, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన అధికారులకు సూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో ఈ సమ్మిట్ నిర్వహిస్తునందున కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు.ఈ సమ్మిట్ కి కావాల్సిన సదుపాయాలపై, బేరక్స్, మెస్, కిచెన్, మరుగుదొడ్లవంటి మౌలిక సదుపాయల గురించి అధికారులతో చర్చించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం సుమారు వెయ్యి మంది ట్రాఫిక్ పోలీసులను నియమించనున్నారు. రహదారుల మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ నిర్వహణ వంటి వాటి కోసం ట్రాఫిక్ మార్షల్స్ నియమించుకోనున్నారు. ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం, ఇబ్బందులు జరగకుండా ఆయా మార్గాలను పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుంది. సాధారణ ప్రజలు, వాహనదారులకు రెండు రోజుల పాటు ఆయా మార్గాలలో రహదారుల మళ్లింపులు ఉంటాయి.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం

**ఎన్నికల రిటర్నింగ్ అధికారుల శిక్షణ తరగతులు**

**నిజామాబాద్, విశాలభారతి:** గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. తొలి విడతగా బోధన్ డివిజన్ లోని మండలాలలో ఈ నెల 11న ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో, ఆ డివిజన్ కు చెందిన ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలకు బోధన్ పట్టణంలోని లయన్స్ భవన్ సమావేశ మందిరంలో శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమయ పాలనను పకాగా పాటిస్తూ, అప్రమత్తతో ఎన్నికలు నిర్వహిస్తే ఇబ్బందులు తలెత్తేందుకు ఆస్కారం ఉండదని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, పోలింగ్ మెటీరియల్ ను జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలని, ముఖ్యంగా బ్యాలెట్ పేపర్ల విషయంలో ప్రత్యేక జాగరూకతతో వ్యవహరించాలని అన్నారు. ఎన్నికల విధుల పట్ల ఆర్.ఓలు తమ బృందంలోని ఎన్నికల సిబ్బంది అందరికీ నియమ, నిబంధనల పట్ల పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. అప్పుడే ఎక్కడ కూడా తప్పిదాలకు తావు లేకుండా సజావుగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయగల్గుతారని అన్నారు. ఉప సర్పంచ్ ఎన్నిక సందర్భంగా తగినంత కోరం ఉందా లేదా అన్నది పరిశీలించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకొని సదుపాయాలను పరిశీలించుకోవాలని, ఓటింగ్ కంపార్ట్ మెంట్, సిటింగ్ ఏర్పాట్లు తదితర వాటిని నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలన్నారు. శిక్షణా తరగతులలో సూచించిన అంశాలను ఆకళింపు చేసుకుని, విధిగా పాటించాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా, అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. బ్యాలెట్ పత్రాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులతో పాటు "నోటా" సింబల్ ను కూడా తప్పనిసరిగా సరిచూసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సజావుగా ఎన్నికల నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించి, జిల్లాకు మంచి పేరు తేవాలని హితవు పలికారు. శిక్షణ తరగతుల్లో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఏ.సీ.పీ రామారావు, డీ.ఎల్.పీ.ఓ, ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలు పాల్గొన్నారు.





# పెళ్లి అయ్యి వారం కూడా కాలేదు.. అప్పుడే షూటింగ్ మొదలు

డిసెంబర్ మొదలు అయిన రోజునే సమంత ఇండస్ట్రీ మొత్తానికి షాక్ ఇచ్చింది. డైరెక్టర్ రాజ్ నిడిమోరుని రెండో వివాహం చేసుకొని అందరూ ఆశ్చర్యపోయేలా చేసింది. కోట్ల ఆస్తి ఉన్నా చాలా సింపుల్ గా ఈషా ఆశ్రమంలో సింపుల్ గా సామ్ - రాజ్ ఒక్కటయ్యారు. ఇక అప్పటి నుంచి ఆమెపై ట్రోల్స్ వస్తూనే ఉన్నాయి. సామ్ పెళ్లి ఫోటోలు ట్రెండింగ్ గా నిలుస్తూనే ఉన్నాయి. ఇప్పటికీ సామ్ సోషల్ మీడియా హాట్ టాపిక్ గానే ఉంది. ఆమె ఏ పోస్ట్ పెట్టినా నిమిషాల్లో వైరల్ గా మారుతుంది. ఇక పెళ్లి తరువాత సామ్.. విదేశాల్లో హనీమూన్ లో ఉంటుంది. ఏ బీచ్ ఒడ్డునో.. లేక ఎడారిలోనో రాజ్- సామ్ ఫోటోలు పెడతారేమో అని ఎదురుచూస్తుంటే అమ్మడు మాత్రం సెట్ లో అడుగుపెట్టి మరోసారి షాక్ ఇచ్చింది.సిటాడెల్ వెబ్ సిరీస్ కన్నా ముందు సమంత ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ అనే ప్రొడక్షన్ హౌస్ ను మొదలుపెట్టింది. ఇందులో మొదటి సినిమాగా మా ఇంటి బంగారం ను అనౌన్స్ చేసింది. ఏడాది దాటిపోయినా ఈ సినిమాను ఎవరు డైరెక్ట్ చేస్తున్నారు అనేది చెప్పలేదు సామ్. ఇక మధ్యలో ఈ బ్యానర్ లో శుభం అనే సినిమా తెరకెక్కించి అదే మొదటి సినిమాగా రిలీజ్ చేశారు. ఈ సినిమా పాజిటివ్ టాక్ తో పాటు మంచి కలెక్షన్స్ కూడా రాబట్టింది. ఇప్పుడు మొదటి సినిమాగా అనౌన్స్ చేసిన మా ఇంటి బంగారం రెండో సినిమాగా పట్టాలెక్కుతున్నట్లు తెలిపింది.ఈ మధ్యనే మా ఇంటి బంగారం పూజా కార్యక్రమాలను పూర్తిచేసుకుంది. సామ్ బెస్ట్ ఫ్రెండ్ అయిన నందిని రెడ్డి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుంది. గుల్షన్ దేవయ్య, సమంత కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పెళ్లి అయ్యి వారం కూడా కాకముందే సామ్.. బంగారం షూట్ లో ప్రత్యేక్షమయ్యింది. అందుకు సంబంధించిన ఫోటోను సామ్ అభిమానులతో పంచుకుంది. ఆ ఫొటోలో మేకప్ రూమ్ లో షాట్ కి రెడీ అవుతున్న సామ్.. పక్కన నందిని రెడ్డి నవ్వుతూ మాట్లాడడం కనిపిస్తుంది. ఇంకా చేతికి గోరింటాకుతోనే సామ్ కనిపించింది. దీంతో హనీమూన్ ని కూడా పక్కన పెట్టి సామ్ పని మీద దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇక ఈ ఫోటో ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది. మరి బంగారం.. హనీమూన్ పక్కన పెట్టి మరీ చేస్తున్న మా ఇంటి బంగారం ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.